మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

గురువారం THURSDAY 2-7-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 2 Volume:2 | సంచిక: 3 Issue: 3

Circulated to Telangana
Published from Jagitial

02 జూలై 2026 - గురువారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - గ్రీష్మ ఋతువు జ్యేష్ఠ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - తె. 5:49 సూర్యాస్తమయం - సా. 6:50 తిథి విదియ ఉ. 9:37 వరకు తరువాత తదియ సంస్కృత వారం బృహస్పతి వాసరః నక్షత్రం ఉత్తరాషాఢ ఉ. 9:18 వరకు తరువాత శ్రవణ యోగం వైధృతి సా. 4:27 వరకు కరణం గరజి ఉ. 9:37 వరకు వనిజ రా. 10:29 వరకు వర్జ్యం మ. 1:50 నుండి మ. 3:35 వరకు దుర్ముహూర్తం ఉ. 10:10 నుండి ఉ. 11:02 వరకు మ. 3:22 నుండి సా. 4:14 వరకు రాహుకాలం మ. 1:57 నుండి మ. 3:35 వరకు యమగండం తె. 5:49 నుండి ఉ. 7:27 వరకు గుళికాకాలం ఉ. 9:04 నుండి ఉ. 10:42 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:13 నుండి తె. 5:01 వరకు అమృత ఘడియలు రా. 12:21 నుండి రా. 2:06 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:54 నుండి మ. 12:46 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున



## ఏడడుగులు వేస్తేనే పెళ్లి జరిగినట్టు!

**రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ సరిపోదు**

**పెళ్లి విందు వినోదాల వేడుక కాదు**

**హిందూ వివాహాలపై గుజరాత్ హైకోర్టు తీర్పు**

హిందూ వివాహ వ్యవస్థ విశిష్టతను చాటిచెబుతూ గుజరాత్ హైకోర్టు ఒక చరిత్రాత్మక తీర్పును వెలువరించింది. హిందూ సంప్రదాయాల ప్రకారం 'సప్తపది' (ఏడడుగులు) వంటి శాస్త్రోక్తమైన క్రతువులు నిర్వహించకుండా, కేవలం మ్యారేజ్ రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ పొందినంత మాత్రాన ఆ పెళ్లి చట్టబద్ధంగా చెల్లుబాటు కాదని హైకోర్టు స్పష్టం చేసింది.

అహ్మదాబాద్: హిందూ వివాహం అనేది కేవలం 'పాటలు, డ్యాన్సులు, విందు వినోదాల' కోసం జరుపుకునే వేడుక కాదని, వధూవరులు పవిత్రమైన అగ్ని సాక్షిగా ఏడు అడుగులు వేయడమే వివాహానికి ఆధ్యాత్మిక, సామాజిక, చట్టపరమైన హోదాను కల్పిస్తుందని జస్టిస్ ఇలేష్ వోరా, జస్టిస్ ఆర్.టి. వాచ్ఛానిల బెంచ్ తేల్చిచెప్పింది. యూకేలో నివసిస్తున్న కౌశల్ సోనార్ అనే వ్యక్తి అప్పీల్‌పై విచారణ జరుపుతూ కోర్టు ఈ తీర్పునిచ్చింది. అహ్మదాబాద్‌కు చెందిన ఒక మహిళ తన సంతకాలను మోసపూరితంగా సేకరించి మ్యారేజ్ సర్టిఫికేట్ పొందిందని, తమ మధ్య ఎలాంటి సంప్రదాయ వివాహ క్రతువులు జరగలేదని కౌశల్ కోర్టును ఆశ్రయించాడు. గతంలో ఫ్యామిలీ కోర్టు ఈ పిటిషన్‌ను తిరస్కరించగా, ఆయన హైకోర్టును ఆశ్రయించారు. విచారణలో సదరు మహిళ కూడా తమ మధ్య ఎలాంటి పెళ్లి ఆచారాలు జరగలేదని అంగీకరించింది. దీంతో, హిందూ వివాహ చట్టం ప్రకారం సప్తపది లేని వివాహం అసలు పెళ్లే కాదని స్పష్టం చేస్తూ, గతంలో ఫ్యామిలీ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేస్తూ ఆ పెళ్లి చెల్లదంటూ హైకోర్టు తీర్పునిచ్చింది.

# ప్రైమ్.. మోసం!

## కస్టమర్లకు అమెజాన్ తీవ్ర అన్యాయం

దిగ్గజ ఈ-కామర్స్, టెక్నాలజీ సంస్థ అమెజాన్ ఆస్ట్రేలియాలో తీవ్రమైన చట్టపరమైన ఆరోపణలు ఎదుర్కొంటోంది. తమ ప్రైమ్ వీడియో స్ట్రీమింగ్ సేవలో అకస్మాత్తుగా ప్రకటనలను ప్రవేశపెట్టి, వాటిని తొలగించుకోవాలంటే వినియోగదారుల నుంచి అదనపు రుసుము వసూలు చేయడంపై ఆ దేశ కాంపిటీషన్ వాచ్‌డాగ్ తీవ్రంగా స్పందించింది. వినియోగదారుల ప్రయోజనాలకు విఘాతం కలిగించేలా, అన్యాయ మైన ఒప్పంద నిబంధనల ను చేర్చారంటూ ఆస్ట్రేలియన్ కాంపిటీషన్ అండ్ కన్స్యూమర్ కమిషన్ (ఏసీసీసీ) అమెజాన్‌పై ఫెడరల్ కోర్టులో దావా వేసింది.



### యాడ్స్ రావొద్దంటే అదనపు డబ్బులా?

**ఇది అన్యాయమైన ఒప్పంద నిబంధన.. ఆస్ట్రేలియా ప్రభుత్వం తీవ్ర ఆగ్రహం**

**ఫెడరల్ కోర్టులో ఏసీసీసీ దావా.. భారీ జరిమానా, నష్టపరిహారం డిమాండ్**

మెల్‌బోర్న్: ఈ వివాదం 2024లో అమెజాన్ తన ప్రైమ్ వీడియో సేవలో ప్రకటనలను చేర్చడంతో మొదలైంది. ఏసీసీసీ వాదన ప్రకారం.. అప్పటికే వార్షిక చందా చెల్లించిన లక్షలాది మంది సబ్‌స్క్రైబర్లు, ఎలాంటి ముందస్తు స్పష్టత లేకుండా యాడ్స్‌తో కూడిన సేవను పొందాల్సి వచ్చింది. ఎవరైనా ప్రకటనలు లేకుండా మునుపటిలా వీడియోలు చూడాలనుకుంటే, నెలకు అదనంగా 2.99 ఆస్ట్రేలియన్ డాలర్లు చెల్లించాలని అమెజాన్ షరతు విధించింది. ఏడాదికి 79 డాలర్లు చెల్లించి వార్షిక సభ్యత్వం తీసుకున్న వారికి ఇది తీవ్ర తరువాయి 2 వ పేజీలో...



## మంత్రులకు '30' ముప్పు

**నేరచరిత ఉంటే పదవికి సంకటం**

**30 రోజుల కస్టడీ చట్టంపై జేపీసీ నిర్ణయం!**

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన 130వ రాజ్యాంగ సవరణ బిల్లుపై పార్లమెంటరీ ఉమ్మడి కమిటీ (జేపీసీ) కీలక నిర్ణయం తీసుకోనుంది. తీవ్రమైన నేరారోపణలపై అరెస్ట్ అయ్యి, వరుసగా 30 రోజుల పాటు కస్టడీలో ఉండే ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు లేదా ఇతర మంత్రులను వారి పదవుల నుండి వెంటనే తొలగించాలనే ప్రతిపాదనను జేపీసీ యథాతథంగా ఉంచే అవకాశం ఉంది. ఈ నిబంధనలో ఎలాంటి మార్పులు చేయకూడదని కమిటీ భావిస్తోంది. డిసెంబర్ 2025 నుండి జరిగిన పది రౌండ్ల సుదీర్ఘ చర్చల అనంతరం ఈ ముసాయిదా నివేదిక సిద్ధమైంది. బీజేపీ ఎంపీ అపరాజిత సారంగి నేతృత్వంలోని 31 మంది సభ్యుల ఈ జేపీసీ తన ముసాయిదా నివేదికను తరువాయి 2 వ పేజీలో...



## ఒకేసారి ఒకే రోగికి 5 అవయవాల మార్పిడి

**ఉస్మానియా వైద్యుల సరికొత్త చరిత్ర**

**భారత్‌లోనే తొలిసారి శస్త్రచికిత్స నిర్వహణ**

**36 గంటల పాటు సాగిన సర్జరీ**

**30 ఏళ్ల యువ ఇంజనీర్‌కు కొత్త జీవితం**

**వైద్యులకు మంత్రి దామోదర అభినందనలు**

దేశ వైద్య చరిత్రలో ఉస్మానియా హాస్పిటల్ మరో అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. దేశంలోనే తొలిసారిగా ఒకే రోగికి ఐదు అవయవాల (మల్టీ-విసెరల్) మార్పిడి శస్త్రచికిత్సను ఉస్మానియా జనరల్ హాస్పిటల్ వైద్యులు విజయవంతంగా నిర్వహించారు.

హైదరాబాద్, జూలై 1 (ఈవార్తలు): ఈ చారిత్రాత్మక విజయంతో తెలంగాణ ప్రభుత్వ వైద్యరంగం మరోసారి దేశవ్యాప్తంగా తన సత్తా చాటుకుంది. సిరిసిల్ల జిల్లాకు చెందిన 30 ఏళ్ల యువ ఇంజనీర్ ఫ్యామిలియల్ అడెనోమాటస్ పాలిపోసిస్ అనే అరుదైన జన్యుపరమైన వ్యాధితో పాటు పెద్దపేగు క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. గతంలో ఒక కార్పొరేట్ హాస్పిటల్‌లో అతనికి పెద్దపేగును -2 వ పేజీలో...

### బంగారం-వెండి ధరలు

| బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో) | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.14,395 |
| వెండి (కిలో): | రూ.2,45,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.4,896 |

### విశ్వవాణి



టోక్యో ఒలింపిక్స్‌లో జావెలిన్ త్రో విభాగంలో రజత పతకం సాధించిన పోలాండ్ క్రీడాకారిణి మరియా ఆండ్రేజ్‌చిక్ తన మానవత్వాన్ని చాటుకున్నారు. తీవ్రమైన గుండె వ్యాధితో బాధపడుతున్న ఎనిమిది నెలల చిన్నారి మిలోషెక్ మలీసా చికిత్స కోసం తన ఒలింపిక్ రజత పతకాన్ని వేలానికి ఉంచారు. ఆ వేలం ద్వారా సుమారు 1.25 లక్షల అమెరికన్ డాలర్లు (దాదాపు రూ. కోటి) సమకూరగా, ఆ మొత్తాన్ని చిన్నారి అమెరికాలో గుండె శస్త్రచికిత్సకు వినియోగించారు. అయితే, అనంతరం వేలంలో పతకాన్ని కొనుగోలు చేసిన పోలాండ్‌కు చెందిన ప్రముఖ సూపర్ మార్కెట్ సంస్థ జాబ్కా.. రజత పతకాన్ని తిరిగి మరియా ఆండ్రేజ్‌చిక్‌కే అందించి, సంస్థ కూడా మానవత్వాన్ని చాటుకుంది.

## జనాభా ఏం మారింది?

**అధ్యయనానికి ప్రత్యేక కమిటీ కసరత్తు.. రాష్ట్రాలకు ప్రత్యేక ప్రశ్నావళి పంపిణీ**

**అక్రమ వలసదారుల గుర్తింపునకు ఈసీ సాయం**



న్యూఢిల్లీ: దేశంలో గత 2011 జనాభా లెక్కల తర్వాత చోటుచేసుకున్న జనాభా మార్పులు, కొత్త నివాస ప్రాంతాల ఏర్పాటుపై అధ్యయనం చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి కమిటీ రంగంలోకి దిగింది. సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి నేతృత్వంలోని ఈ జనాభా మార్పుల కమిటీ అన్ని రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు ఒక సుదీర్ఘమైన ప్రశ్నావళిని పంపడానికి సిద్ధమైంది. 2011 నాటి జనాభా గణాంకాలను ప్రస్తుత పరిస్థితులతో పోల్చి చూసి ఎక్కడెక్కడ అసాధారణ మార్పులు జరిగాయో ఈ కమిటీ క్షుణ్ణంగా పరిశీలించనుంది. అవసరమైన ప్రాంతాలలో తరువాయి 2 వ పేజీలో...

## సామాన్యులకూ ఫోరెన్సిక్ సేవలు

**ఫోరెన్సిక్ సైన్స్‌లో కొత్త అధ్యాయం**



నోయిడా: ఫోరెన్సిక్ విజ్ఞాన రంగంలో భారతదేశం ఒక కీలక మైలురాయిని చేరుకుంది. నోయిడా కేంద్రంగా పనిచేస్తున్న 'లక్షర్ ఎవిడెన్స్ ల్యాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్', ఫోరెన్సిక్ టెస్టింగ్ కోసం ప్రతిష్ఠాత్మక 'నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ టెస్టింగ్ అండ్ కాలిబ్రేషన్ లాబొరేటరీస్ (ఎన్ఏబీఎల్ )' నుంచి గుర్తింపు పొందినట్లు ప్రకటించింది. ఒకేసారి పలు కీలకమైన ఫోరెన్సిక్ విభాగాల్లో ఈ అక్రిడిటేషన్ సాధించిన భారతదేశంలోని మొట్టమొదటి ప్రైవేట్ ప్రయోగశాల తమదేనని సంస్థ వెల్లడించింది. ఈ అక్రిడిటేషన్ డిజిటల్ ఫోరెన్సిక్స్, ఫిజికల్ ఫోరెన్సిక్స్, క్రైమ్ సీన్ మేనేజ్‌మెంట్ వంట తరువాయి 2 వ పేజీలో...



## శాంతికి సిద్ధం.. యుద్ధానికీ రెడీ

- దోహా చర్చల వేళ అమెరికాకు ఇరాన్ వార్నింగ్
- అణు హక్కులపై రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టీకరణ
- లెబనాన్ సార్వభౌమత్వానికి ఇరాన్ డిమాండ్

టెహ్రాన్: ఖతార్ రాజధాని దోహా వేదికగా అమెరికాతో కీలకమైన చర్చలు ప్రారంభం కానున్న నేపథ్యంలో అగ్రరాజ్యానికి ఇరాన్ గట్టి హెచ్చరికలు జారీ చేసింది. తాము దౌత్యపరమైన శాంతి చర్చలకు కట్టుబడి ఉన్నామని, ఒకవేళ ఈ చర్చలు విఫలమై, ఇచ్చిన మాట తప్పితే మాత్రం 'యుద్ధానికి కూడా సిద్ధమే'నని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్, చర్చల ప్రధాన ప్రతినిధి మహమ్మద్ బాగెర్ గాలిబాఫ్ స్పష్టం చేశారు. శుద్ధిచేసిన యురేనియంతో కూడిన తమ దేశ అణు హక్కుల విషయంలో తరువాయి 2 వ పేజీలో...



## రాశి ఫలాలు
2.7.2026

మేషం: దూర ప్రయాణాలు అనుకూలిస్తాయి. వాహన సంబంధిత వ్యాపారాలు అనుకూలిస్తాయి. వృత్తి, ఉద్యోగముల విషయంలో సంతృప్తికర వాతావరణం ఉంటుంది. భూ క్రయ విక్రయాలలో ఆశించిన లాభాలు పొందుతారు. ఆర్ధిక పురోగతి సాధిస్తారు. ఇతరులతో సంబంధాలు మెరుగుపడతాయి.

వృషభం: భాగసౌమ్య వ్యాపారాలలో పెట్టుబడులకు అనుకూలం లేదు. బంధు మిత్రులతో వివాదములకు దూరంగా ఉండటం మంచిది. ఆరోగ్య విషయంలో అశ్రద్ధ చెయ్యడం మంచిది కాదు. చేపట్టిన పనులందు ఆటంకములు తప్పవు. ప్రయాణాలలో వాహన ప్రమాద సూచనలున్నవి.

మిధునం: ఆదాయ మార్గాలు మరింత పెరుగుతాయి. ముఖ్యమైన వ్యవహారాలలో జీవిత భాగస్వామి సలహా తీసుకుని ముందుకు సాగడం మంచిది. వ్యాపారాల విస్తరణకు నూతన అవకాశాలు లభిస్తాయి. మొండి బకాయిలు వసూలవుతాయి. బంధు మిత్రుల ఆదరణ పెరుగుతుంది. ప్రయాణాలలో అప్రమత్తంగా వ్యవహరించాలి.

కర్కాటకం: నూతన పరిచయాలు లాభసాటిగా సాగుతాయి. సంతానం పోటీ పరీక్షలలో విజయం సాధిస్తారు. ఇంటా బయట మీ మాటకు విలువ పెరుగుతుంది. వృత్తి వ్యాపారాలలో ఆశించిన పురోగతి సాధిస్తారు. ఆకస్మిక ధన లాభ సూచనలున్నవి. నిరుద్యోగులకు శుభవార్తలు అందుతాయి.

సింహం: కుటుంబ సభ్యుల సహాయ సహకారాలతో నూతన కార్యక్రమాలు ప్రారంభిస్తారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. స్థిరాస్తి క్రయ విక్రయాలలో అనుకూల ఫలితాలు పొందుతారు. వృత్తి వ్యాపారాలలొ ఆలోచించి పెట్టుబడులు పెట్టాలి. ఆర్థిక వ్యవహారాలలొ ఒడిదుడుకులు ఉంటాయి.

కన్య: వృత్తి ఉద్యోగాలలో అదనపు బాధ్యతలు పెరిగినా సమర్ధవంతంగా నిర్వహిస్తారు. విలువైన గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు. సన్నిహితులతో వివాదాలు పరిష్కారమవుతాయి. దీర్ఘకాలిక ఋణాల నుండి కొంత ఊరట లభిస్తుంది. వ్యాపారాలు అనుకూలంగా సాగుతాయి. స్వల్ప ధన లాభ సూచనలున్నవి.

తుల: నూతన వాహన కొనుగోలు ప్రయత్నాలు వాయిదా వేస్తారు. ఉద్యోగ పరంగా చిన్నపాటి సమస్యలు ఉంటాయి. సోదరులతో స్థిరాస్తి వివాదాలు పరిష్కరించుకుంటారు. ఆరోగ్య విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలి. వృత్తి వ్యాపారాలలో చికాకులు తప్పవు. వ్యాపారములు మందకొడిగా సాగుతాయి.

వృశ్చికం: దూరపు బంధువుల నుండి అందిన కీలక సమాచారం కొంత ఊరట కలిగిస్తుంది. విలువైన వస్తువుల విషయంలో జాగ్రత్త వహించాలి. చేపట్టిన పనులు సకాలంలో పూర్తికావు. సన్నిహితులతో వివాదాలు చికాకు పరుస్తాయి. ఉద్యోగమున అధికారుల ఆగ్రహానికి గురికావలసి వస్తుంది.

ధనస్సు: చేపట్టిన పనులలో జాప్యం కలిగిన నిదానంగా పూర్తి చేస్తారు. దూర ప్రాంత బంధువులు నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. వృత్తి వ్యాపారములు లాభసాటిగా సాగుతాయి. గృహమున బంధు మిత్రులతో ఆనందంగా గడుపుతారు. ఉద్యోగమున ఉన్నత పదవులు పొందుతారు. నిరుద్యోగులకు శుభవార్తలు అందుతాయి.

మకరం: ధార్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. ఆదాయ మార్గాలు అంతంత మాత్రంగా ఉంటాయి. నూతన వ్యాపార ప్రారంభమునకు అవరోధాలు తప్పవు. చేపట్టిన పనులలో కష్టానికి తగిన ఫలితం ఉండదు. చెయ్యని పనికి ఇతరుల నుండి నిందలు పడవలసి వస్తుంది. ఉద్యోగ విషయంలో అలోచించి నిర్ణయాలు తీసుకోవడం మంచిది.

కుంభం: సన్నిహితులతో వివాదాలు పరిష్కారమౌతాయి. కుటుంబ సభ్యుల నుండి అరుదైన బహుమతులు అందుకుంటారు. ఇంటా బయట అనుకూల వాతావరణం ఉంటుంది. గృహమున వివాహ శుభకార్య ప్రయత్నాలు ఫలిస్తాయి. ముఖ్యమైన వ్యవహారములు అనుకూలంగా సాగుతాయి. సంతానం విద్యా ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి.

మీనం: ఆదాయం ఆశించిన విధంగా ఉంటుంది. కుటుంబ సభ్యులతో దైవ దర్శనాలు చేసుకుంటారు. వృత్తి వ్యాపారాలు మరింత మెరుగ్గా రాణిస్తాయి. సంతాన వివాహ విషయమై కీలకమైన నిర్ణయాలు తీసుకుంటారు. ఉద్యోగమున అధికారుల ఆదరణ పెరుగుతుంది. ఆర్థిక పురోగతి కలుగుతుంది. ఆప్తుల నుండి శుభవార్తలు అందుతాయి.



# ప్రైమ్.. మోసం!

**మొదటి పేజీ తరువాయి**

అన్యాయమని ఏసీసీసీ ఆరోపించింది. ఈ మార్పులు చేసిన సమయంలో ఇప్పటికే 8.5 లక్షల మందికి పైగా ఆస్ట్రేలియన్ వినియోగదారులు వార్షిక చందా చెల్లించి ఉన్నారు. అదనపు రుసుము చెల్లించని వారికి, వారు డబ్బు చెల్లించిన సేవలో కోత విధించినట్లు అయ్యిందని (డౌన్‌గ్రేడ్) ఏసీసీసీ తన పిటిషన్‌లో పేర్కొంది. ఏసీసీసీ చైర్ గినా కాస్-గాట్లిబ్ ఒక ప్రకటనలో మాట్లాడుతూ.. "అమెజాన్ తన వార్షిక ప్రైమ్ ఒప్పందాలలో అనేక అన్యాయమైన నిబంధనలను చేర్చింది. వాటిని అడ్డం పెట్టుకునే ప్రైమ్ వీడియోలో ప్రకటనలను ప్రవేశపెట్టింది" అని వివరించారు.

### కేవలం యాడ్స్ సమస్యే కాదు

ఈ కేసు కేవలం యాడ్స్ ప్రదర్శనకు మాత్రమే పరిమితం కాలేదు. అమెజాన్ తన ఒప్పందాలలో చేర్చిన ఐదు కీలక నిబంధనలను ఏసీసీసీ లక్ష్యంగా చేసుకుంది. ఈ నిబంధనలు సబ్‌స్క్రైబర్లకు ఎలాంటి వాపసు లేదా సరైన నష్టపరిహారం ఇవ్వకుండానే ప్రైమ్ సేవలలో ఏకపక్షంగా, ముఖ్యమైన మార్పులు చేయడానికి అమెజాన్‌కు అధికారం కట్టబెట్టాయని ఏసీసీసీ వాదిస్తోంది. 2023 నవంబర్ నుంచి 2025 ఆగస్టు మధ్య కాలంలో పది లక్షల మందికి పైగా కస్టమర్లు సంతకం చేసిన ఒప్పందాలలో ఈ నిబంధనలు ఉన్నాయని రెగ్యులేటర్ పేర్కొంది. వినియోగదారుల నుంచి వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా ఏసీసీసీ ఈ దర్యాప్తును ప్రారంభించింది. ఈ కేసులో అమెజాన్‌కు భారీ జరిమానా విధించాలని, ప్రభావితమైన వినియోగదారులకు నష్టపరిహారం ఇప్పించాలని, కోర్టు ఖర్చులు చెల్లించాలని ఏసీసీసీ న్యాయస్థానాన్ని కోరింది. ఈ ఆరోపణలపై అమెజాన్ ఆస్ట్రేలియా ప్రతినిధి స్పందిస్తూ.. "ఏసీసీసీ దాఖలు చేసిన కేసును మేము క్షుణ్ణంగా సమీక్షిస్తున్నాము. దర్యాప్తు ప్రారంభమైనప్పటి నుంచి మేము రెగ్యులేటర్‌కు పూర్తిగా సహకరించాము" అని తెలిపారు. దశాబ్దానికి పైగా ప్రకటనలు లేకుండా అందుబాటులో ఉన్న ప్రైమ్ వీడియో, 2024 ప్రారంభం నుంచి ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో యాడ్స్‌ను ప్రవేశపెట్టింది.

# మంత్రులకు '30' ముప్పు

**మొదటి పేజీ తరువాయి**

జూలై 10వ తేదీ నాటికి సర్క్యులేట్ చేయనుంది. ఆ తర్వాత జూలై 17న కమిటీ మరోసారి సమావేశమై నివేదికకు తుది రూపు ఇస్తుంది. జూలై 20 నుండి ప్రారంభం కానున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాల కంటే ముందే ఈ సిఫార్సులను ఖరారు చేయాలని ప్యానెల్ గట్టిగా నిర్ణయించింది. అధికార కూటమికి కమిటీలో పూర్తి బలమున్నందున తమ అభిప్రాయాలకు విలువ ఉండదనే నెపంతో ఇండియా కూటమి సభ్యులు ఈ జేపీసీ సమావేశాలను బహిష్కరించడం గమనార్హం.

### దుర్వినియోగం కాకుండా జాగ్రత్తలు

ఈ నూతన నిబంధన ప్రకారం నిందితులకు బెయిల్ తెచ్చుకోవడానికి 30 రోజుల సుదీర్ఘ సమయం దొరుకుతుందని, ఇది సహజ న్యాయ సూత్రాలకు ఎలాంటి భంగం కలిగించదని కమిటీ సభ్యులు అభిప్రాయపడ్డారు. ఈ చట్టం రాజకీయ ప్రతీకారాలకు లేదా దుర్వినియోగానికి గురికాకుండా ఉండేలా కమిటీ ఒక ప్రత్యేకమైన హెచ్చరిక క్లాజును కూడా నివేదికలో చేర్చనుంది. రాజకీయాల్లో నైతికతను, సుపరిపాలనను పెంపొందించేందుకు ఈ చట్టం ఎంతో దోహదపడుతుందని అధికార పక్షం బలంగా నమ్ముతోంది. ఈ బిల్లు ఆమోదం పొందితే దేశ రాజకీయాల్లో జవాబుదారీతనం మరింత పెరుగుతుంది.


# మంత్రులకు '30' ముప్పు

**మొదటి పేజీ తరువాయి**

జూలై 10వ తేదీ నాటికి సర్క్యులేట్ చేయనుంది. ఆ తర్వాత జూలై 17న కమిటీ మరోసారి సమావేశమై నివేదికకు తుది రూపు ఇస్తుంది. జూలై 20 నుండి ప్రారంభం కానున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాల కంటే ముందే ఈ సిఫార్సులను ఖరారు చేయాలని ప్యానెల్ గట్టిగా నిర్ణయించింది. అధికార కూటమికి కమిటీలో పూర్తి బలమున్నందున తమ అభిప్రాయాలకు విలువ ఉండదనే నెపంతో ఇండియా కూటమి సభ్యులు ఈ జేపీసీ సమావేశాలను బహిష్కరించడం గమనార్హం.

### దుర్వినియోగం కాకుండా జాగ్రత్తలు

ఈ నూతన నిబంధన ప్రకారం నిందితులకు బెయిల్ తెచ్చుకోవడానికి 30 రోజుల సుదీర్ఘ సమయం దొరుకుతుందని, ఇది సహజ న్యాయ సూత్రాలకు ఎలాంటి భంగం కలిగించదని కమిటీ సభ్యులు అభిప్రాయపడ్డారు. ఈ చట్టం రాజకీయ ప్రతీకారాలకు లేదా దుర్వినియోగానికి గురికాకుండా ఉండేలా కమిటీ ఒక ప్రత్యేకమైన హెచ్చరిక క్లాజును కూడా నివేదికలో చేర్చనుంది. రాజకీయాల్లో నైతికతను, సుపరిపాలనను పెంపొందించేందుకు ఈ చట్టం ఎంతో దోహదపడుతుందని అధికార పక్షం బలంగా నమ్ముతోంది. ఈ బిల్లు ఆమోదం పొందితే దేశ రాజకీయాల్లో జవాబుదారీతనం మరింత పెరుగుతుంది.


# జనాభా ఏం మారింది?

**మొదటి పేజీ తరువాయి**

కమిటీ సభ్యులు స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాలు సేకరిస్తారు. ప్రజలు తమ సూచనలు, సలహాలు పంపడానికి వీలుగా ఒక ప్రత్యేక ఈమెయిల్ ఐడీని కూడా అందుబాటులోకి తీసుకురానున్నారు.

### 2027 జనాభా లెక్కల తొలి దశ


దేశంలో దాదాపు పదహారేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత తదుపరి జనాభా గణన ప్రక్రియ ప్రారంభమైంది. 'జనాభా గణన 2027' కి సంబంధించిన మొదటి విడత పనులు ప్రస్తుతం దేశంలోని పలు ప్రాంతాలలో ముమ్మరంగా సాగుతున్నాయి. ఇళ్ల జాబితా తయారీ, గృహ వసతుల గుర్తింపు ప్రక్రియ ఈ ఏడాది సెప్టెంబర్ 30వ తేదీ నాటికి పూర్తి కానుంది. దీని ఆధారంగా ఆయా ప్రాంతాలలో పెరిగిన నివాసాలు, జనాభాపై ఒక ప్రాథమిక అంచనాకు రావడానికి వీలవుతుంది. దీని తర్వాత అసలు జనాభా లెక్కింపు ప్రక్రియను వచ్చే ఏడాది మార్చి 1, 2027 నాటికి పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ గణాంకాలు దేశ భవిష్యత్తు ప్రణాళికలకు ఎంతో కీలకం కానున్నాయి.

### ఓటర్ల తొలగింపుపై నివేదికల సేకరణ

దేశంలో అక్రమ వలసదారుల సంఖ్యను కచ్చితంగా అంచనా వేయడానికి ఈ ఉన్నత స్థాయి కమిటీ ఎన్నికల సంఘం సహాయం తీసుకోనుంది. ఇటీవల నిర్వహించిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో భాగంగా ఓటు హక్కు కోల్పోయిన వారి వివరాలను కమిటీ సేకరించనుంది. జాబితా నుండి పేర్లను ఎందుకు తొలగించాల్సి వచ్చిందనే కారణాలను కూడా నివేదిక రూపంలో ఇవ్వాలని ఎన్నికల సంఘాన్ని కోరనుంది. ఇప్పటివరకు 13 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో ఈ సవరణ ప్రక్రియ పూర్తయింది. ఇందులో భాగంగా చాలా మంది ఓటర్ల పేర్లు తొలగించినట్లు తెలుస్తోంది. ఈ తొలగింపుల వెనుక ఉన్న అసలు కారణాలను విశ్లేషించడం ద్వారా అక్రమ వలసలను గుర్తించడం సులువవుతుందని కమిటీ భావిస్తోంది.

### కేంద్ర హోంమంత్రితో కమిటీ భేటీ

జనాభా మార్పుల కమిటీ సభ్యులు జూన్ 25వ తేదీన కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. తాము చేపట్టబోయే క్షేత్రస్థాయి పర్యటనలు, వివిధ కేంద్ర మంత్రిత్వ శాఖలతో జరపబోయే చర్చల ప్రణాళికను హోంమంత్రికి వివరించారు.



# సామాన్యులకూ ఫోరెన్సిక్ సేవలు

**మొదటి పేజీ తరువాయి**

కీలక విభాగాలకు వర్తిస్తుందని లక్షర్ ల్యాబ్స్ తెలిపింది. అంతర్జాతీయంగా ఆమోదించబడిన ప్రమాణాలకు అనుగుణంగా ల్యాబొరేటరీలోని పరీక్షా పద్ధతులు, నాణ్యతా నిర్వహణ వ్యవస్థలు, మౌలిక సదుపాయాలు, పరికరాల క్యాలిబ్రేషన్, సిబ్బంది శాస్త్రీయ నైపుణ్యం వంటి అంశాలను క్షుణ్ణంగా అంచనా వేసిన తర్వాత ఎన్ఏబీఎల్ ఈ గుర్తింపును మంజూరు చేసింది. అంతేకాకుండా ఉత్తరప్రదేశ్‌లో ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఫోరెన్సిక్ టెస్టింగ్ కోసం ఎన్ఏబీఎల్ అక్రిడిటేషన్ పొందిన మొట్టమొదటి ల్యాబొరేటరీ కూడా తమదేనని కంపెనీ గర్వంగా ప్రకటించింది. ఈ సందర్భంగా లక్షర్ ఎవిడెన్స్ ల్యాబ్స్ ఫోరెన్సిక్ సర్వీసెస్ డైరెక్టర్ ఇంద్రజీత్ రాయ్ మాట్లాడుతూ.. "ఇది కేవలం మా సంస్థకు మాత్రమే లభించిన మైలురాయి కాదు, సైన్స్ ద్వారా న్యాయం కోరుకునే ప్రతి పౌరుడికి దక్కిన విజయం. ఇప్పటివరకు ప్రభుత్వ ఏజెన్సీలకే పరిమితమైన అక్రిడిటేషన్ పొందిన ఫోరెన్సిక్ సేవలను అందరికీ అందుబాటులోకి తీసుకురావాలన్నదే మా ప్రధాన లక్ష్యం. నేటి నుంచి ప్రతి వ్యక్తి, న్యాయవాది, వ్యాపారవేత్త, సంస్థలు.. అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన ప్రయోగశాల నుంచి విశ్వసనీయమైన, శాస్త్రీయంగా ధృవీకరించబడిన ఫోరెన్సిక్ సాక్ష్యాలను పొందే అవకాశం లభించింది" అని వివరించారు. భారత ప్రభుత్వ నాణ్యతా మండలి కింద పనిచేసే స్వయంప్రతిపత్తి కలిగిన సంస్థ అయిన ఎన్ఏబీఎల్, ప్రయోగశాలల సాంకేతిక నైపుణ్యం, నిర్దేశిత నాణ్యతా ప్రమాణాలను కఠినంగా పరిశీలించిన తర్వాతే అక్రిడిటేషన్‌ను మంజూరు చేస్తుంది. ఈ గుర్తింపుతో ఇకపై వ్యక్తులు, కార్పొరేట్ సంస్థలు, న్యాయ నిపుణులు, దర్యాప్తు ఏజెన్సీలు.. డిజిటల్, మొబైల్ పరికరాల ఫోరెన్సిక్స్, డాక్యుమెంట్ ఎగ్జామినేషన్, చేతిరాత, సంతకాల విశ్లేషణ, వేలిముద్రల పరిశీలన, ఆడియో, వీడియో ఫోరెన్సిక్స్, క్లౌడ్ ఫోరెన్సిక్స్, క్రైమ్ సీన్ ఇన్వెస్టిగేషన్ వంటి అధునాతన సేవలను పొందవచ్చని కంపెనీ పేర్కొంది. తాము అందించే ఫోరెన్సిక్ పరీక్షలు, నిపుణుల అభిప్రాయాలు 'భారతీయ సాక్ష్య అధినియం-2023' నిబంధనలకు అనుగుణంగా ఉంటాయని, న్యాయపరమైన, దర్యాప్తు ప్రక్రియలలో వినియోగానికి వీలు కల్పిస్తాయని స్పష్టం చేసింది. ఈ పరిణామం దేశంలో న్యాయం పొందే ప్రక్రియను మరింత వేగవంతం చేయడానికి, పారదర్శకంగా మార్చడానికి దోహదపడుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# ఒకేసారి ఒకే రోగికి 5 అవయవాల మార్పిడి

**మొదటి పేజీ తరువాయి**

పూర్తిగా తొలగించడంతో పాటు చిన్నపేగులో సుమారు 60 శాతం భాగాన్ని తొలగించారు. అనంతరం అతను తీవ్ర పోషకాహార లోపం, బరువు తగ్గడం, తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతూ ఆరు నెలల క్రితం ఉస్మానియా హాస్పిటల్‌ను ఆశ్రయించాడు. ఉస్మానియా వైద్యులు నిర్వహించిన సమగ్ర పరీక్షల్లో చిన్నపేగు, డ్యూడినమ్ తదితర జీర్ణాశయ అవయవాల్లో మరిన్ని పాలిప్స్, ట్యూమర్లు ఉన్నట్లు గుర్తించారు. రోగి పరిస్థితిని సమగ్రంగా పరిశీలించిన అనంతరం అతడిని జీవన్‌దాన్ కార్యక్రమంలో మల్టీ-విసెరల్ ట్రాన్స్‌ప్లాంటేషన్ కోసం నమోదు చేశారు. ఇటీవల 35 ఏళ్ల మహిళ గర్భధారణ సమయంలో అధిక రక్తపోటు (ప్రీ-ఎక్లాంప్సియా) కారణంగా తీవ్ర మెదడు రక్తస్రావానికి గురై ఉస్మానియా హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ బ్రెయిన్ డెడ్‌గా ప్రకటించబడింది. వైద్యులు అవయవదానంపై ఆమె కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించగా, వారు ఎంతో ఉదారంగా అవయవదానానికి అంగీకరించారు. అవయవదాత నుంచి సేకరించిన జీర్ణాశయం, డ్యూడినమ్, ప్యాంక్రియాస్, చిన్నపేగు, కుడివైపు పెద్దపేగు అనే ఐదు అవయవాలను సుమారు 36 గంటల పాటు నిరంతరాయంగా సాగిన అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్స ద్వారా వైద్యులు విజయవంతంగా మార్పిడి చేశారు. ప్రస్తుతం రోగి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉండగా, వెంటిలేటర్‌ను కూడా తొలగించినట్లు వైద్యులు తెలిపారు. ఈ తరహా ఒకే రోగికి ఐదు అవయవాల మల్టీ-విసెరల్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌ను భారతదేశంలో తొలిసారిగా విజయవంతంగా నిర్వహించిన ఘనత ఉస్మానియా జనరల్ హాస్పిటల్‌కు దక్కింది. ఇలాంటి శస్త్రచికిత్సలు ప్రపంచవ్యాప్తంగా ఇప్పటివరకు అమెరికా, బ్రెజిల్ వంటి కొద్ది దేశాల్లో మాత్రమే నమోదయ్యాయి. ఈ అపూర్వ విజయాన్ని పురస్కరించుకుని జాతీయ అవయవాలు, కణజాల మార్పిడి సంస్థ డాక్టర్స్ డే సందర్భంగా తన అధికారిక ట్విటర్ ఖాతాలో ఉస్మానియా జనరల్ హాస్పిటల్ ఉస్మానియా మెడికల్ కాలేజ్ వైద్య బృందాన్ని ప్రత్యేకంగా అభినందించింది. భారత ప్రభుత్వ ఆసుపత్రిలో తొలి ఐదు అవయవాల మల్టీ-విసెరల్ ట్రాన్స్‌ప్లాంటేషన్, అలాగే ఫ్యామిలియల్ అడెనోమాటస్ పాలిపోసిస్ ఉన్న రోగికి దేశంలోనే తొలి మల్టీ-విసెరల్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌గా తన ట్వీట్‌లో పేర్కొంది. అలాగే ఈ విజయానికి కారణమైన వైద్య బృందం, అవయవదాత, ఆమె కుటుంబ సభ్యుల సేవాభావాన్ని ప్రత్యేకంగా కొనియాడింది. ఈ సందర్భంగా రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఉస్మానియా వైద్య బృందాన్ని హృదయపూర్వకంగా అభినందించారు. దేశ వైద్య చరిత్రలో చిరస్థాయిగా నిలిచే ఘనతను ఉస్మానియా వైద్యులు సాధించారని కొనియాడారు. ప్రభుత్వ హాస్పిటల్స్‌లో ప్రపంచ స్థాయి, అత్యంత క్లిష్టమైన అవయవ మార్పిడి శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించగల సామర్థ్యం తెలంగాణకు ఉందని ఈ విజయం మరోసారి నిరూపించిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం, ప్రభుత్వ వైద్యరంగాన్ని అత్యాధునిక సాంకేతికత, నైపుణ్యంతో బలోపేతం చేస్తోందని, దాని ఫలితంగానే ఉస్మానియా వంటి ప్రభుత్వ హాస్పిటల్స్ దేశానికి ఆదర్శంగా నిలిచే విజయాలు సాధిస్తున్నాయని మంత్రి పేర్కొన్నారు. ఈ అరుదైన శస్త్రచికిత్సను విజయవంతం చేసిన ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్లు, గ్యాస్ట్రోఎంటరాలజిస్టులు, అనస్థీషియా నిపుణులు, క్రిటికల్ కేర్ వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, ట్రాన్స్‌ప్లాంట్ కోఆర్డినేటర్లు, ఇతర సిబ్బంది అందరికీ మంత్రి ప్రత్యేక అభినందనలు తెలిపారు. అలాగే అవయవదానం ద్వారా మరో ప్రాణానికి జీవం పోసిన అవయవదాత కుటుంబ సభ్యుల సేవాభావానికి మంత్రి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.



## రాముడి గుడిలోనే దొంగతనమా?

**మోదీ, అమిత్ షాపై జగ్గారెడ్డి ఆగ్రహం**

సంగారెడ్డి, జూలై 1 (ఈవార్తలు): అయోధ్య శ్రీరామ మందిరంలో భక్తులు సమర్పించిన హుండీ డబ్బుల చోరీ ఘటనపై కాంగ్రెస్ సీనియర్ నేత జగ్గారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. యూపీలోనూ, కేంద్రంలోనూ బీజేపీ ప్రభుత్వమే ఉన్నా, రామాలయ ట్రస్ట్ వారి పరిధిలోనే నడుస్తున్నా... ఈ దొంగతనం జరిగిందని ఆయన అన్నారు. ఈ చోరీపై ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా స్పందించకపోవడం దారుణమన్నారు. ఇన్నేళ్లుగా రాముడి పేరును కేవలం రాజకీయాల కోసం, ఓటు బ్యాంక్ కోసమే బీజేపీ వాడుకుందని ఆయన విమర్శించారు. ఈ ఘటనపై విచారణకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఎంపీల బృందాన్ని పంపనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ అన్ని మతాలను గౌరవిస్తుందని, ఈ వైఫల్యానికి గాను ప్రధాని మోదీ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇదే సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేస్తున్న విమర్శలపై జగ్గారెడ్డి స్పందిస్తూ... కేటీఆర్ ప్రస్తుతం ఖాళీగా ఉండి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్ రెడ్డి మాత్రం గత ప్రభుత్వం చేసిన అప్పులు తీరుస్తూ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత విద్యుత్ వంటి హామీలను అమలు చేస్తూ పాలనలో బిజీగా ఉన్నారని చెప్పారు. కేటీఆర్ ఎన్ని విమర్శలు చేసినా రేవంత్ రెడ్డే సీఎంగా కొనసాగుతారని జగ్గారెడ్డి స్పష్టం చేశారు.

## మూడెకరాల రైతులకు భరోసా జమ

హైదరాబాద్, జూలై 1 (ఈవార్తలు): తెలంగాణలో వానాకాలం సీజన్‌కు సంబంధించిన రైతు భరోసా పెట్టుబడి సాయం పంపిణీ రెండో రోజూ కొనసాగింది. ప్రభుత్వం ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం మూడెకరాల వరకు భూమి ఉన్న రైతులందరి బ్యాంకు ఖాతాల్లోకి బుధవారం నిధులను డీబీటీ విధానంలో నేరుగా జమ చేసింది. ఈ విడతలో రాష్ట్రవ్యాప్తంగా 10.68 లక్షల మంది రైతులకు రూ.1,590.02 కోట్ల పెట్టుబడి సాయం అందనున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఇప్పటి వరకు రైతు భరోసా కింద 54.96 లక్షల మంది రైతుల ఖాతాల్లోకి మొత్తం రూ.4,072.04 కోట్ల నిధులను విజయవంతంగా బదిలీ చేసినట్లు తెలిపింది. వానాకాలం సాగు ప్రారంభమైన వేళ ఎరువులు, విత్తనాల కొనుగోలుకు ఈ సాయం ఉపయోగపడుతుండటంతో రైతులు సాగు పనులను వేగవంతం చేస్తున్నారు.

# మీ లెక్కల్లో పెద్ద బొక్క!

## రేవంత్, భట్టి విక్రమార్క వేర్వేరు లెక్కలు .. ఎవరి లెక్కలు నిజం?: హరీశ్ రావు



మంచిర్యాల, జూలై 1 (ఈవార్తలు): శిల్పకళావేదిక సాక్షిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పచ్చి అబద్ధాలు చెప్పారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు విమర్శలు గుప్పించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీల వైఫల్యాల నుండి ప్రజల దృష్టి మళ్లించడానికే రేవంత్ రెడ్డి రైతుల పేరుతో కొత్త డ్రామాలకు తెరతీశారని మండిపడ్డారు. రైతు భరోసా పేరుతో కేవలం పబ్లిసిటీ స్టంట్లు చేయడం తప్ప, క్షేత్రస్థాయిలో అన్నదాతల అసలు సమస్యలను ఈ ప్రభుత్వం పూర్తిగా గాలికొదిలేసిందని ధ్వజమెత్తారు. ఒకే సభలో పక్కపక్కనే కూర్చున్న రేవంత్, భట్టి విక్రమార్క వేర్వేరు లెక్కలు చెప్పారని హరీశ్ ఎద్దేవా చేశారు. రైతుల కోసం రూ.1.56 లక్షల కోట్లు ఖర్చు చేశామని భట్టి విక్రమార్క చెబితే... రేవంత్ రెడ్డి ఏకంగా రూ.1.75 లక్షల కోట్లు ఖర్చు చేశామని చెప్పారని... అసలు వీరిద్దరిలో ఎవరి లెక్కలు నిజమో చెప్పాలని నిలదీశారు. 2027 మార్చి వరకు వ్యవసాయ రంగానికి చేసిన మొత్తం బడ్జెట్ కేటాయింపులే సుమారు రూ.82 వేల కోట్లు అయితే, 2026 జూన్ నాటికే లక్షన్నర కోట్లకు పైగా ఎలా ఖర్చు చేశారో సమాధానం చెప్పాలన్నారు. ఎన్నికల సమయంలో షరతులు లేని రూ.2 లక్షల రుణమాఫీ అని ఓట్లు దండుకుని, తీరా అధికారంలోకి వచ్చాక కేవలం స్వల్పకాలిక రుణాలకే అది వర్తిస్తుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పడం రైతులను నిలువునా ముంచడమేనన్నారు. ఇకనైనా ఫేక్ ప్రచారాలు ఆపి, రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, లేనిపక్షంలో అన్నదాతలే కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. రేవంత్ రెడ్డి చేసిన రైతు మోసాలపై అసెంబ్లీతో పాటు ఏ వేదికపైనైనా చర్చకు తాము సిద్ధమంటూ సవాల్ విసిరారు.

**సింగరేణి అధికారుల సమ్మె బాధాకరం: హరీశ్ రావు**

సింగరేణి కోల్ మైన్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పీఆర్పీ, పీఆర్సీ తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శ్రీరాంపూర్ జీఎం ఆఫీస్ వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారుల ఆందోళనకు బీఆర్ఎస్ పార్టీ తరపున ఆయన సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. సింగరేణి చరిత్రలో కార్మికులు తమ హక్కుల కోసం సమ్మె చేయడం చూశాం కానీ, కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య విధానాల వల్ల నేడు అధికారులు సైతం సమ్మెకు దిగి రిలే నిరాహార దీక్షలు, ర్యాలీలు చేయాల్సిన దుస్థితి రావడం బాధాకరమన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అధికారులకు క్రమం తప్పకుండా ప్రతి ఏటా పీఆర్పీ (పెర్ఫార్మెన్స్ రిలేటెడ్ పే) చెల్లించాం, కానీ ఈ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి గత రెండేళ్లుగా పీఆర్పీ నిలిపివేసి అధికారుల హక్కులను కాలరాస్తోందని మండిపడ్డారు. పీఆర్పీ ఇస్తే అధికారుల్లో ఉత్సాహం పెరిగి ఉత్పత్తి పెరుగుతుంది, కానీ రెండేళ్లుగా పీఆర్పీ నిలిపివేయడం వల్ల అధికారులు ఆందోళనకు గురై బొగ్గు ఉత్పత్తి భారీగా పడిపోయింది. సింగరేణిలో బొగ్గు నిల్వలు, ఉత్పత్తి తగ్గిపోవడం వల్ల రాష్ట్రంలోని కేటీపీఎస్, యాదాద్రి, భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్లలో కొన్ని యూనిట్లు మూతపడ్డాయి. ఈ ప్రభుత్వ తప్పుడు విధానాల వల్ల విద్యుత్ ఉత్పత్తి ఆగిపోయి, ఈ వర్షాకాలంలో కూడా తెలంగాణ డిస్కంలు బయట పవర్ ఎక్స్చేంజీల నుంచి కరెంటు కొనుక్కోవాల్సిన దౌర్భాగ్య పరిస్థితి ఏర్పడింది. దాదాపు 2,500 మంది అధికారులు నల్ల కండువాలు వేసుకుని ధర్నా చేస్తుంటే ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు కనీసం చీమ కుట్టినట్లు కూడా లేకపోవడం శోచనీయమన్నారు. సింగరేణి ఎప్పుడూ కోల్ ఇండియా మార్గదర్శకాలను పాటించడం ఆనవాయితీ.. కాబట్టి కోల్ ఇండియాలో ఇప్పటికే అమలు చేసిన 'పే అప్‌గ్రేడేషన్' విధానాన్ని ఎలాంటి జాప్యం లేకుండా తక్షణమే ఇక్కడ కూడా అమలు చేయాలి. గతంలో కేవలం పనితీరు, ప్రొడక్షన్ ఆధారంగా అత్యంత పారదర్శకంగా కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు జరిగేవి, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పారదర్శకతను గాలికొదిలేసి బదిలీల్లో రాజకీయ జోక్యంతో అవినీతికి వత్తాసు పలుకుతోందని ఆరోపించారు.

## తారీఖు చెప్పు.. తడాఖా చూపిస్త

**మీ, మా పాలనపై చర్చకు సిద్ధం.. వైఫల్యాలు నిరూపించకపోతే**

**రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటా.. సీఎంకు కేటీఆర్ ప్రతిసవాల్**



హైదరాబాద్, జూలై 1 (ఈవార్తలు): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విసిరిన సవాల్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్వీకరించారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రస్తుత పాలన, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు తాను సిద్ధమని ఆయన ప్రకటించారు. ఈ చర్చకు సంబంధించిన తేదీ, సమయాన్ని ఖరారు చేయాలని ఆయన ముఖ్యమంత్రిని డిమాండ్ చేశారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కేటీఆర్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇటీవల రైతు భరోసా నిధుల విడుదల కార్యక్రమంలో ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలపై కేటీఆర్ ఘాటుగా స్పందించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు ఇచ్చిన గడువులో సగం కాలం పూర్తయినా, చెప్పుకోవడానికి ఒక్క విజయం కూడా లేదని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో వరి సాగు 2014-15 నాటికి ఉన్న 26 లక్షల హెక్టార్ల నుంచి, పాలన ముగిసే సమయానికి 59 లక్షల హెక్టార్లకు పెరిగిందని గుర్తు చేశారు. కాళేశ్వరం వంటి ప్రాజెక్టులు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాయని ఆయన ఈ సందర్భంగా వివరించారు. ప్రస్తుత ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి గత ప్రభుత్వంపై నిందలు వేస్తోందని కేటీఆర్ ఆరోపించారు. తాము అధికారం నుంచి దిగిపోయే నాటికి రాష్ట్ర అప్పు రూ. 3.5 లక్షల కోట్లు మాత్రమేనని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంత దారుణంగా ఉంటే ముఖ్యమంత్రి 72 సార్లు ఢిల్లీ పర్యటనలు ఎందుకు చేశారని ఆయన ప్రశ్నించారు. అసెంబ్లీ, ప్రెస్ క్లబ్ లేదా జూబ్లీహిల్స్ ప్యాలెస్.. వేదిక ఏదైనా చర్చకు తాను వస్తానని కేటీఆర్ స్పష్టం చేశారు. ఈ చర్చకు రేవంత్ రెడ్డి లేదా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వచ్చినా తనకు అభ్యంతరం లేదన్నారు. "ప్రభుత్వ వైఫల్యాలను ఆధారాలతో సహా నిరూపించడంలో నేను విఫలమైతే, రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటాను" అని కేటీఆర్ సంచలన ప్రకటన చేశారు.

## యూట్యూబ్‌లో చూసి హత్య

**24 గంటల్లోనే కేసు ఛేదించిన కరీంనగర్ పోలీసులు**

**వివాహేతర సంబంధం, అవమానాలే హత్యకు కారణమని వెల్లడి**

కరీంనగర్, జూలై 1 (ఈవార్తలు): తెలంగాణలోని కరీంనగర్‌లో దారుణ హత్యోదంతం చోటుచేసుకుంది. హత్య ఎలా చేయాలో యూట్యూబ్ వీడియోలలో చూసి, ఓ వ్యక్తిని అత్యంత కిరాతకంగా చంపిన నిందితుడిని పోలీసులు కేవలం 24 గంటల్లోనే అరెస్ట్ చేశారు. ఈ కేసులో బంగారపు మహేష్ (40) అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. పోలీసుల కథనం ప్రకారం.. మృతుడు పైతరి మొగిలి (52) ఓ వివాహితపై అత్యాచార యత్నం కేసులో జైలుకు వెళ్లి ఇటీవల విడుదలయ్యాడు. అయితే, జైలు నుంచి వచ్చాక కూడా అతను తన పద్ధతి మార్చుకోలేదు. ఆ మహిళను వేధించడం కొనసాగించాడు. అదే మహిళతో వివాహేతర సంబంధం ఉన్న నిందితుడు మహేష్‌ను కూడా మొగిలి తరచూ అవమానించేవాడు. వారి సంబంధం గురించి చుట్టుపక్కల గ్రామాల్లో ప్రచారం చేస్తూ, మహేష్ పరువు తీస్తున్నాడు. ఈ క్రమంలో ఇరువురి మధ్య గొడవలు కూడా జరిగాయి. మొగిలి నుంచి ఎదురవుతున్న నిరంతర వేధింపులు, అవమానాలు భరించలేకపోయిన మహేష్, అతడిని అంతమొందించాలని నిర్ణయించుకున్నాడు. ఇందుకోసం యూట్యూబ్‌లో హత్యలు ఎలా చేయాలి, ఆయుధాలు ఎలా సిద్ధం చేసుకోవాలి వంటి వీడియోలు చూసి పక్కా ప్రణాళిక రచించాడు. హుజూరాబాద్ ఏసీపీ మాధవి తెలిపిన వివరాల ప్రకారం.. "శనివారం రాత్రి మడిపల్లి గ్రామంలో జరిగిన పీరీల పండుగకు హాజరై మొగిలి సైకిల్‌పై ఇంటికి తిరిగి వస్తుండగా, ఓ కల్వర్టు వద్ద కాపుకాచిన మహేష్ వెనుక నుంచి ఇనుప రాడ్‌తో దాడి చేశాడు. తలపై పలుమార్లు బలంగా కొట్టి, అతను చనిపోయాడని నిర్ధారించుకున్న తర్వాత ఇంటికి వెళ్లి, రక్తంతో తడిసిన బట్టలు మార్చుకుని పరారయ్యాడు" అని వివరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. విచారణలో భాగంగా మహేష్‌ను ప్రశ్నించగా, తానే హత్య చేసినట్లు అంగీకరించాడు. నిందితుడి నుంచి నేరానికి ఉపయోగించిన ఇనుప రాడ్, యూట్యూబ్ సెర్చ్ హిస్టరీ ఉన్న మొబైల్ ఫోన్, బైక్, హత్య సమయంలో ధరించిన దుస్తులను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేసి జ్యుడీషియల్ కస్టడీకి పంపినట్లు వెల్లడించారు. భవిష్యత్తులో ఇలాంటి నేరాలకు పాల్పడకుండా నిందితుడిపై రౌడీ షీట్ తెరిచేందుకు కూడా జిల్లా పోలీసులు యోచిస్తున్నారు.

## 'బండి భగీరథ్' బాధితురాలికి నోటీసులు

**వాదన వినేందుకు హైకోర్టు తాఖీదులు**

**కేసు విచారణ శుక్రవారానికి వాయిదా వేసిన హైకోర్టు**

**ప్రస్తుతం చర్లపల్లి జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న భగీరథ్**

హైదరాబాద్, జూలై 1 (ఈవార్తలు): పోక్సో కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న బండి భగీరథ్ దాఖలు చేసిన రెగ్యులర్ బెయిల్ పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో బుధవారం విచారణ జరిగింది. తనపై నమోదు చేసిన కేసు పూర్తిగా రాజకీయ ప్రేరేపితమని, ఎలాంటి తప్పూ చేయలేదని, పోలీసుల విచారణకు పూర్తిగా సహకరిస్తున్నానని భగీరథ్ తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఈ నేపథ్యంలో బెయిల్ మంజూరు చేయాలని న్యాయస్థానాన్ని కోరారు. అయితే బెయిల్ పిటిషన్‌పై నిర్ణయం తీసుకునే ముందు బాధితురాలి వాదన కూడా వినాల్సి ఉందని హైకోర్టు పేర్కొంది. ఈ మేరకు కౌంటర్ దాఖలు చేయాలని బాధితురాలికి నోటీసులు జారీ చేసింది. అనంతరం కేసు తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది. మైనర్ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో బండి భగీరథ్‌పై మే 8న పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో కేసు నమోదైన విషయం తెలిసిందే. అనంతరం పరారైన అతణ్ని మే 16న పోలీసులు అరెస్టు చేసి చర్లపల్లి జైలుకు తరలించారు. ఇంజినీరింగ్ పరీక్షలు రాసేందుకు వీలుగా ఈ నెల 20 నుంచి 24 వరకు మధ్యంతర బెయిల్ మంజూరైంది. గడువు ముగియడంతో గత వారం మళ్లీ చర్లపల్లి జైలుకు తరలించారు. ప్రస్తుతం రెగ్యులర్ బెయిల్ పిటిషన్‌పై హైకోర్టు ఎల్లుండి ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే అంశంపై ఆసక్తి నెలకొంది.

## లెక్చరర్లకు నైపుణ్య శిక్షణ

**ఇంటర్ బోర్డు కీలక నిర్ణయం.. రెండు అవగాహన ఒప్పందాలు**

హైదరాబాద్, జూలై 1 (ఈవార్తలు): రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్, వృత్తి విద్యా కాలేజీల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు అధ్యాపకులకు వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించడమే లక్ష్యంగా ఇంటర్ బోర్డు రెండు కీలక అవగాహన ఒప్పందాలను కుదుర్చుకుంది. హైదరాబాద్‌లోని ఇంటర్మీడియట్ విద్యామండలి కార్యాలయంలో రేడియంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఆర్ఐటీ), ప్రముఖ ఫార్మా సంస్థ ఎంఎస్ఎన్ ల్యాబొరేటరీస్ ప్రతినిధులతో ఈ ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందం ప్రకారం, ప్రభుత్వ వృత్తి విద్యా కాలేజీల లెక్చరర్లకు ఆర్ఐటీ ఆధ్వర్యంలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్ నిర్వహిస్తారు. అలాగే, విద్యార్థుల ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేందుకు ఈటీ, ఈసీటీ, ఎంఈ విభాగాల విద్యార్థులకు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఆన్-ది-జాబ్ ట్రైనింగ్ అందించనున్నారు. ఈ సందర్భంగా ఇంటర్ బోర్డు కార్యదర్శి అభిలాష అభినవ్ మాట్లాడుతూ పరిశ్రమలు-విద్యాసంస్థల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని తగ్గించడానికి, విద్యార్థులను ఉద్యోగాలకు సిద్ధం చేయడానికి ఈ ఒప్పందం ఎంతో కీలకమైందన్నారు. ఎటువంటి ఖర్చు లేకుండా ఉచితంగా నాణ్యమైన శిక్షణ అందించడం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది అధ్యాపకులు, విద్యార్థులు లబ్ధి పొందుతారని తెలిపారు. మరో ప్రధాన ఒప్పందంలో భాగంగా, ఇంటర్మీడియట్ పూర్తి చేసిన ప్రభుత్వ జూనియర్ కాలేజీల విద్యార్థులకు ఫార్మా రంగంలో విస్తృత కెరీర్ అవకాశాలను కల్పించేందుకు ఎంఎస్ఎన్ (ఎంఎస్ఎన్) ల్యాబొరేటరీస్ ముందుకు వచ్చింది. 2023 నుండి 2026 విద్యా సంవత్సరాల మధ్య ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపీసీ, ఎంఎల్టీ, ఫార్మా టెక్నాలజీ కోర్సులు విజయవంతంగా పూర్తి చేసిన అర్హులైన విద్యార్థులను ఈ సంస్థ నేరుగా రిక్రూట్ చేసుకోనుంది. ఎంఎస్ఎన్ ల్యాబొరేటరీస్ హ్యూమన్ రీసోర్సెస్ వైస్ ప్రెసిడెంట్ కెఎల్ఎన్ మూర్తి మాట్లాడుతూ యువతలోని ప్రతిభను ప్రోత్సహించడం, వారు విజయవంతమైన కెరీర్‌ను నిర్మించుకునేలా అవకాశాలు సృష్టించడం తమ బాధ్యత అన్నారు.

## తెలంగాణలో రాముడి ఆదర్శ పాలన: మల్లు రవి

నాగర్ కర్నూల్, జూలై 1 (ఈవార్తలు): తెలంగాణలో సాగుతోంది రాముడి ఆదర్శ పాలన అని ఆ పార్టీ సీనియర్ నేత, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి అన్నారు. దేవుడి సొమ్మును కూడా దిగమింగిన బీజేపీకి ఇక పుట్టగతులుండవు అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సర్వజన సంక్షేమమే ధ్యేయంగా దూసుకుపోతుంటే, ఓర్వలేక బీజేపీ నేతలు మూర్ఖపు విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణలో ఉనికి కోసం ఆరాటపడుతున్న బీజేపీ... దేశంలో అత్యంత అవినీతి, నియంతృత్వ ధోరణులతో ఒక 'రావణాసుర పాలన' సాగిస్తోందని మల్లు రవి ధ్వజమెత్తారు. ఇటీవల తెలంగాణలో పర్యటించిన బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ పర్యటన ఒక 'అట్టర్ ఫ్లాప్ షో' అని ఎద్దేవా చేశారు. ఇక్కడ కాంగ్రెస్‌ను గద్దె దించడం ఎవరి వల్లా కాదని, తెలంగాణ సమాజం మత విద్వేష రాజకీయాలను ఎన్నటికీ ఆదరించదని స్పష్టం చేశారు. అయోధ్య రాముడి పేరుతో 40 ఏళ్లుగా రాజకీయం చేస్తున్న బీజేపీ... చివరకు ఆ దేవుడి సొమ్మును కూడా వదలకుండా మింగేసిందని తీవ్ర ఆరోపణలు చేశారు. స్వయంగా యూపీలోని అయోధ్య వాసులే ఆ పార్టీ అవినీతిపై ఆగ్రహంతో ఉన్నారని, దేశంలో కమలం పార్టీకి కాలం చెల్లిందన్నారు. విభజన రాజకీయాలు చేస్తున్న బీజేపీకి రాబోయే సార్వత్రిక ఎన్నికలే చివరివని, త్వరలోనే దేశం 'బీజేపీ ముక్త్ భారత్' కాబోతుందని జోస్యం చెప్పారు. రాబోయే రోజుల్లో దేశవ్యాప్తంగా కాంగ్రెస్ గాలి వీయడం, రాహుల్ గాంధీ ప్రధాని పీఠాన్ని అధిరోహించడం ఖాయమని మల్లు రవి ధీమా వ్యక్తం చేశారు.

## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

*అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.*

\- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

**సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.**

## హజ్ యాత్రికులకు ఏపీ సర్కారు రూ.లక్ష సాయం

అమరావతి, జూలై 1 (ఈవార్తలు): 2026 మక్కా హజ్ యాత్రకు వెళ్లిన యాత్రికులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బాసటగా నిలిచింది. విజయవాడ విమానాశ్రయం నుంచి ప్రయాణించిన వారిపై పడిన అదనపు విమాన చార్జీల భారాన్ని తగ్గించేందుకు, ఒక్కో యాత్రికుడికి లక్ష రూపాయల చొప్పున సబ్సిడీని విడుదల చేసింది. ఈ మొత్తాన్ని ప్రభుత్వం నేరుగా యాత్రికుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. ఈ ఏడాది రాష్ట్రం నుంచి మొత్తం 1,987 మంది హజ్ యాత్రకు వెళ్లగా, వారిలో 331 మంది విజయవాడ నుంచి ప్రయాణించారు. బెంగళూరు, హైదరాబాద్ విమానాశ్రయాలతో పోలిస్తే విజయవాడ నుంచి ప్రయాణించిన వారికి దాదాపు రూ. 80,000 అదనపు భారం పడింది. ఈ విషయాన్ని గుర్తించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, వారికి లక్ష రూపాయల చొప్పున ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించారు. దీనికి అనుగుణంగా, 331 మంది యాత్రికుల కోసం మొత్తం రూ. 3.31 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. ప్రభుత్వ నిర్ణయంపై మైనార్టీ వ్యవహారాల సలహాదారు ఎండీ షరీఫ్ హర్షం వ్యక్తం చేశారు. గత ఏడాది (2025) కూడా విజయవాడ యాత్రికులకు ఇదే విధంగా ప్రభుత్వం అండగా నిలిచిందని ఆయన గుర్తుచేశారు. ఇచ్చిన మాటకు కట్టుబడి, ముస్లిం మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఎన్డీఏ ప్రభుత్వం హామీలను నిలబెట్టుకుంటుం దనడానికి ఇదే నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ఇదే సమయంలో, వైసీపీ అనుకూల మీడియా వైఖరిపై షరీఫ్ తీవ్ర విమర్శలు గుప్పించారు. సబ్సిడీ చెల్లింపులో చోటుచేసుకున్న 15 రోజుల స్వల్ప జాప్యాన్ని ఆసరాగా చేసుకుని, సాక్షి పత్రిక, బ్లూ సోషల్ మీడియా అసత్య ప్రచారాలు చేశాయని ఆరోపించారు. ఇది అత్యంత దిగజారుడు రాజకీయమని, ఇటువంటి అసత్య ప్రచారాలను మానుకోకపోతే ప్రజలు మరోసారి తగిన బుద్ధి చెబుతారని 'తస్మాత్ జాగ్రత్త' అంటూ ఆయన హెచ్చరించారు.

## వాన.. వస్తుందా?

**రాబోయే 4 రోజులు భారీ వర్ష సూచన!**

హైదరాబాద్, జూలై 1 (ఈవార్తలు): రాష్ట్రవ్యాప్తంగా రాగల నాలుగు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. గాలివేగం గంటకు 40 నుండి 50 కి.మీ. వేగంతో బలమైన ఉపరితల గాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. దేశవ్యాప్తంగా నైరుతి రుతుపవనాలు శరవేగంగా విస్తరిస్తున్నాయి. దక్షిణ మధ్య మధ్యప్రదేశ్ నుండి తూర్పు మధ్య అరేబియా సముద్రం వరకు సముద్ర మట్టానికి 4.5 నుండి 5.8 కిలోమీటర్ల ఎత్తులో ఏర్పడిన ఉపరితల ద్రోణి ప్రస్తుతం బలహీనపడిన కారణంగా వర్షాల తీవ్రత పెరిగే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. భారీ వర్షాలు రాష్ట్రంలోని ఆదిలాబాద్, కుమరం భీం అసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని పేర్కొంది. అలాగే ఈ నెల 4న బలమైన ఉపరితల గాలులు ఆదిలాబాద్, కుమరం భీం అసిఫాబాద్, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాల్లో వీచే అవకాశం ఉందని తెలిపింది.

# పిల్లలు ఏడిస్తే నోట్లో టాయిలెట్ స్ప్రే కొట్టింది!

బెంగళూరు: బెంగళూరులోని ఓ డేకేర్ కేంద్రంలో 2-3 ఏళ్ల వయసున్న చిన్నారులపై అమానుషంగా ప్రవర్తించిన ఘటన కలకలం రేపింది. ఏడుస్తున్న చిన్నారులను వాషింగ్ మెషీన్‌లో కూర్చోబెట్టడం, టాయిలెట్ జెట్ స్ప్రేతో నోట్లోకి నీళ్లు చల్లడం, బాత్‌రూమ్‌లో బంధించడం వంటి శిక్షలు విధించినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటన నగరంలోని క్యాప్‌జెమినీ సంస్థ హెచ్‌ఏఎల్ క్యాంపస్‌లో నిర్వహిస్తున్న డేకేర్ కేంద్రంలో జరిగినట్లు పోలీసులు తెలిపారు. చిన్నారులను భయపెట్టి మౌనంగా ఉంచేందుకే ఇలాంటి అమానుష చర్యలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైంది. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. డేకేర్‌లో పనిచేస్తున్న ఐదుగురు మహిళా సంరక్షకులపై కేసు నమోదు చేశారు. మరోవైపు ఈ వ్యవహారంపై కర్ణాటక రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్‌కు కూడా ఫిర్యాదు అందింది. కార్పొరేట్ కార్యాలయాల్లో నడుస్తున్న డేకేర్ కేంద్రాల భద్రత, పర్యవేక్షణపై ఈ ఘటన తీవ్ర ఆందోళనకు దారితీసింది.

# స్కూల్ బస్సుపై చెట్టు కూలి బాలుడి మృతి

**క్రికెట్ బాల్‌తోనే అంత్యక్రియలు**

ముంబై: ముంబైలో హృదయవిదారక ఘటన చోటుచేసుకుంది. భవిష్యత్తులో గొప్ప క్రికెటర్ కావాలని కలలు కన్న 11 ఏళ్ల బాలుడు, పాఠశాల బస్సుపై భారీ వృక్షం కూలిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. ఆ బాలుడికి ఇష్టమైన క్రికెట్ బాల్‌తోనే కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది. ముంబైలోని చెంబూర్ ప్రాంతంలో ఈ విషాదం చోటుచేసుకుంది. యూనివర్సల్ హైస్కూల్‌లో 6వ తరగతి చదువుతున్న విహాన్ శ్రీవాస్తవ్, మరో 12 మంది విద్యార్థులతో కలిసి స్కూల్ బస్సులో ఇంటికి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మధ్యాహ్నం సమయంలో చెంబూర్‌లోని సుభాష్ నగర్‌లో కురిసిన భారీ వర్షానికి, సుమారు 40 నుంచి 50 ఏళ్ల నాటి రావి చెట్టు వేళ్లతో సహా పెకిలించుకుని వచ్చి బస్సుపై పడింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన విహాన్‌ను హుటాహుటిన ఆసుపత్రికి తరలించినప్పటికీ, అప్పటికే బాలుడు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ ప్రమాదంలో మరో నలుగురు విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. విహాన్ మరణంతో ఆ కుటుంబంలో అంతులేని విషాదం నెలకొంది. తన కుమారుడికి క్రికెట్ అంటే ప్రాణమని గుర్తుచేసుకుంటూ, తల్లి జూహీ ఆ బాలుడి బ్యాట్‌ను పట్టుకుని విలపించిన తీరు అక్కడున్న వారిని కలచివేసింది. విహాన్‌కు క్రికెట్ అంటే అమితమైన ఇష్టమని, అందుకే ఆ బాలుడికి ఇష్టమైన క్రికెట్ బాల్‌తోనే అంత్యక్రియలు నిర్వహించామని ఓ కుటుంబ సభ్యుడు ఆవేదనతో తెలిపారు.

# పాక్ వల్లే సింధూనది సంక్షోభం

**నిర్వహణ లోపం, అవినీతితో సాగునీటి వ్యవస్థలు నిర్వీర్యం**

**దేశ ఆహార భద్రత, ఆర్థిక వ్యవస్థపై పడుతున్న తీవ్ర ప్రభావం**

ఇస్లామాబాద్: పాకిస్థాన్‌లోని సింధు నదీ పరీవాహక ప్రాంతంలో నెలకొన్న తీవ్ర నీటి సంక్షోభానికి బాహ్య కారణాల కంటే దేశీయంగా ఉన్న నిర్లక్ష్యం, అసమర్థ నిర్వహణ, మౌలిక సదుపాయాల వైఫల్యాలే ప్రధాన కారణమని తాజా విశ్లేషణలు స్పష్టం చేస్తున్నాయి. ప్రపంచంలోనే అతిపెద్ద సాగునీటి వ్యవస్థల్లో ఒకటైన సింధు బేసిన్, పాకిస్థాన్ ఆహార భద్రతకు, ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక వంటిది. అయితే, పాలకుల ఉదాసీనత వల్ల ఈ కీలక వ్యవస్థ ప్రస్తుతం పెను ప్రమాదంలో పడింది. దశాబ్దాలుగా సాగునీటి కాలువల నిర్వహణను విస్మరించడం, అవినీతి, ప్రావిన్సుల మధ్య నీటి పంపకాల వివాదాలు ఈ సమస్యను మరింత జఠిలం చేశాయి. అనేక కాలువలకు లైనింగ్ లేకపోవడంతో భారీ స్థాయిలో నీరు వృథా అవుతోంది. మరోవైపు, భూగర్భ జలాల మితిమీరిన వినియోగం, భూములు చౌడుబారడం వంటి సమస్యలు వ్యవసాయ రంగాన్ని కుదేలు చేస్తున్నాయి. పటిష్టమైన జాతీయ జల విధానం లేకపోవడం కూడా ఈ దుస్థితికి ప్రధాన కారణంగా మారింది. ఈ నీటి సంక్షోభం రైతులు, మత్స్యకారుల జీవనంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. సింధు డెల్టా ప్రాంతంలోకి సముద్రపు నీరు చొచ్చుకురావడంతో సాగు భూములు నిస్సారంగా మారాయి. ఫలితంగా, గత కొన్నేళ్లలో లక్షలాది మంది జీవనోపాధిని కోల్పోయి ఇతర ప్రాంతాలకు వలస వెళ్లినట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. ప్రస్తుతం హిందూకుష్-హిమాలయ ప్రాంతంలో హిమపాతం తగ్గడం వల్ల నదుల్లో ప్రవాహాలు క్షీణించాయి. అయినప్పటికీ, నీటి వృథాను అరికట్టి, మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంతో పాటు వాతావరణానికి అనువైన పంటలను సాగు చేయడం ద్వారా ఈ సంక్షోభం నుంచి గట్టెక్కవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# కొండపై హత్యకు ముందే రిహార్సల్

**పుణే కేసులో సంచలన విషయాలు.. ప్రత్యక్ష సాక్షులు లేక సవాల్‌గా కేసు**

పుణే: పుణేలో సంచలనం సృష్టించిన రియల్టర్ కేతన్ అగర్వాల్ హత్య కేసులో దర్యాప్తు ముందుకు వెళుతోన్న కొద్దీ సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. హత్యకు ముందు నిందితులు సియా గోయల్, చేతన్ చౌదరి ఓ కొండపై రిహార్సల్ చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. మార్కెట్ యార్డ్ సమీపంలోని ఓ కొండపై హత్య ఎలా చేయాలనే దానిపై ముందుగా ప్రాక్టీస్ చేసినట్లు ఇద్దరూ విచారణలో అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం జూన్ 18న లోహగడ్ కోట వద్ద కేతన్ అగర్వాల్‌ను కొండపై నుంచి తోసి హత్య చేసినట్లు వెల్లడించారు. హత్య జరిగిన రోజు చేతన్ చౌదరి ఉపయోగించిన స్కూటర్‌ను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అతడి సమక్షంలో లోహగడ్ కోట వద్ద ఘటనను సీన్ రీక్రియేట్ చేస్తున్నారు. అలాగే సీసీటీవీ ఫుటేజీలో కనిపించిన వ్యక్తి చేతన్ చౌదరేనని నిర్ధారించేందుకు అతడి నడక తీరుపై (గైట్ అనాలిసిస్) కూడా పోలీసులు పరీక్షలు నిర్వహిస్తున్నారు. కేసు దర్యాప్తు కొనసాగుతోంది. ఈ కేసులో ప్రత్యక్ష సాక్షులు లేకపోవడం పోలీసులకు పెద్ద సవాల్‌గా మారింది. దీంతో ఆధారాలు, ఫోరెన్సిక్ నివేదికలు, సీసీటీవీ ఫుటేజీలు, నిందితుల వాంగ్మూలాలు వంటి అంశాలపైనే దర్యాప్తు కొనసాగుతోంది. న్యాయస్థానంలో కేసును బలంగా నిరూపించాలంటే 'పంచశీల సూత్రాల' ప్రకారం అన్ని ఆధారాలు ఒకదానికొకటి అనుసంధానమై, నిందితులే నేరానికి పాల్పడ్డారని సందేహానికి తావులేకుండా రుజువు చేయాల్సి ఉంటుందని న్యాయ నిపుణులు చెబుతున్నారు.

# విజయ్ ప్రభుత్వాన్ని కూల్చే కుట్ర?

**ఎమ్మెల్యేలకు రూ.35 కోట్ల ఆఫర్ ఆరోపణలు**

**15 మంది రాజీనామాల ద్వారా ప్రభుత్వం పడగొట్టే యత్నం**

**ముగ్గురి అరెస్ట్.. డీఎంకే నేత సెంథిల్ బాలాజీ కుట్రలు!**

చెన్నై: తమిళనాడులో ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని ప్రభుత్వాన్ని కూల్చేందుకు కుట్ర జరిగిందంటూ సంచలన ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. ఈ కుట్రను రాష్ట్ర ఇంటెలిజెన్స్ విభాగం భగ్నం చేసిందని, ఈ కేసులో ఇప్పటికే ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు ఎన్‌డీటీవీ తన కథనంలో పేర్కొంది. ఎన్‌డీటీవీ కథనం ప్రకారం.. విజయ్ పార్టీకి చెందిన ఉతంగరై ఎమ్మెల్యే ఎన్. ఎలైయరాజా ఇచ్చిన ఫిర్యాదుతో ఈ వ్యవహారం బయటపడింది. అసెంబ్లీ స్పీకర్ జేసీడీ ప్రభాకర్‌పై అవిశ్వాస తీర్మానానికి మద్దతు ఇవ్వాలని, అందుకు రూ.35 కోట్లు ఇస్తామని ఓ కన్సల్టెన్సీ సంస్థ ప్రతినిధి తనను సంప్రదించాడని ఎమ్మెల్యే ఆరోపించారు. ఈ విషయాన్ని బయటకు చెబితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని బెదిరించినట్లు కూడా ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదు ఆధారంగా దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు తొలుత చెన్నైలో ఒకరిని, అనంతరం కరూర్‌లో మరో ఇద్దరిని అరెస్ట్ చేశారు. దర్యాప్తులో ఈ వ్యవహారానికి డీఎంకే ఎమ్మెల్యే సెంథిల్ బాలాజీతో సంబంధాలున్నట్లు గుర్తించినట్లు ఎన్‌డీటీవీ పేర్కొంది. అయితే దీనిపై అధికారికంగా ఎలాంటి నిర్ధారణ వెలువడలేదు. ఈ ఘటనపై స్పందించిన తమిళనాడు మంత్రి సీటీ నిర్మల్ కుమార్.. సెంథిల్ బాలాజీకి సన్నిహితులే ఈ కుట్రలో ఉన్నారని ఆరోపించారు. విజయ్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు పలువురు ఎమ్మెల్యేలకు రూ.10 కోట్ల నుంచి రూ.50 కోట్ల వరకు ఆఫర్లు ఇచ్చారని కూడా ఆయన ఆరోపించారు. అయితే ఈ ఆరోపణలను డీఎంకే ఖండించింది.

# వాట్సాప్ యూజర్ నేమ్‌పై కేంద్రం అభ్యంతరం!

**మోసాలు, ఫేక్ ప్రొఫైల్స్ పెరిగే ప్రమాదం ఉందని ఆందోళన.. భద్రతా చర్యలు తీసుకున్నామంటున్న వాట్సాప్ యాజమాన్యం**

న్యూఢిల్లీ: మెటా యాజమాన్యంలోని వాట్సాప్ ఇటీవల ప్రవేశపెట్టిన 'యూజర్‌నేమ్' ఫీచర్‌పై భారత ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ కొత్త ఫీచర్ ద్వారా ఆన్‌లైన్ మోసాలు, ఫేక్ ప్రొఫైల్స్‌తో ఇతరులను మోసగించడం (ఇంపర్సొనేషన్) వంటివి పెరిగే అవకాశం ఉందంటూ ప్రభుత్వ అధికారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై సమగ్ర విచారణ చేపట్టినట్లు బుధవారం వెలువడిన పలు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. వాట్సాప్ ఈ యూజర్‌నేమ్ ఫీచర్‌ను జూన్ 29న ప్రపంచవ్యాప్తంగా పరిచయం చేసింది. దీనివల్ల వినియోగదారులు తమ ఫోన్ నంబర్లను బహిర్గతం చేయకుండానే, కేవలం యూజర్‌నేమ్ ద్వారా ఇతరులతో సంభాషించే అవకాశం ఉంటుంది. ఇది వినియోగదారుల గోప్యతను మరింత మెరుగుపరుస్తుందని, ముఖ్యంగా స్పామ్ కాల్స్, సిమ్-స్వాపింగ్ వంటి ముప్పుల నుంచి రక్షణ కల్పిస్తుందని వాట్సాప్ పేర్కొంది. ప్రముఖులు, ప్రభుత్వ సంస్థల పేర్లతో నకిలీ ఖాతాలు సృష్టించకుండా ఉండేందుకు కొన్ని పేర్లను ముందస్తుగా రిజర్వ్ చేసినట్లు కూడా సంస్థ వెల్లడించింది. అయితే, ఈ ఫీచర్‌పై ప్రభుత్వ వర్గాలు పలు అభ్యంతరాలను వ్యక్తం చేస్తున్నాయి. 50 కోట్లకు పైగా వినియోగదారులతో వాట్సాప్‌కు భారత్ అతిపెద్ద మార్కెట్‌గా ఉన్న నేపథ్యంలో, ఈ మార్పులపై ఆందోళన నెలకొంది. మోసగాళ్లు బ్యాంకులు, పాపులర్ బ్రాండ్లు లేదా ప్రముఖుల పేర్లను పోలిన యూజర్‌నేమ్‌లను సృష్టించి సామాన్యులను మోసగించే ప్రమాదం ఉందని అధికారులు విశ్లేషిస్తున్నారు. "ఈ అంశంలో భద్రతా పరమైన జాగ్రత్తలు తీసుకోవాల్సింది వాట్సాప్ యాజమాన్యమే" అని ఓ అధికారి స్పష్టం చేశారు. గతంలో పరీక్షల పేపర్ల లీకేజీ ఉదంతాల్లో టెలిగ్రామ్‌పై కేంద్రం కఠిన చర్యలు తీసుకున్న సంగతి తెలిసిందే. అదే తరహాలో,




యూజర్‌నేమ్ ఫీచర్ దుర్వినియోగాన్ని అరికట్టడంలో విఫలమైతే వాట్సాప్ మాతృసంస్థ మెటాకు నోటీసులు జారీ చేసే దిశగా ప్రభుత్వం ఆలోచిస్తోంది. ప్రస్తుతం ప్రభుత్వం ఈ ఫీచర్‌కు సంబంధించిన భద్రతా ప్రమాణాలను నిశితంగా సమీక్షిస్తోంది. వినియోగదారుల గోప్యత మరియు సైబర్ భద్రత మధ్య సమతుల్యత సాధించే వరకూ ఈ విషయంలో ఉత్కంఠ కొనసాగే అవకాశం ఉంది.

# డీఎంకే మాజీ మిత్రులతో విజయ్ భేటీ

**తమిళ రాజకీయాల్లో కీలక మలుపు.. ప్రభుత్వాన్ని పటిష్టం చేసుకుంటున్న టీవీకే చీఫ్**

చెన్నై: తమిళనాడు రాజకీయాలు వేగంగా మారుతున్నాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి, తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత విజయ్ తన ప్రభుత్వాన్ని పటిష్టం చేసుకునే దిశగా వ్యూహాత్మక అడుగులు వేస్తున్నారు. ఇందులో భాగంగా, గతంలో డీఎంకే కూటమిలో కొనసాగిన భాగస్వామ్య పక్షాలను తనవైపు తిప్పుకునే ప్రయత్నాలను ముమ్మరం చేశారు. బుధవారం కాంగ్రెస్, వీసీకే, ఎండీఎంకే, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయూఎంఎల్) వంటి పార్టీలతో విజయ్ కీలక భేటీ నిర్వహించారు. ఎన్నికల అనంతరం తమకు మద్దతు ప్రకటించిన పార్టీలకు కృతజ్ఞతలు తెలిపేందుకే ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు అధికారికంగా చెబుతున్నప్పటికీ, దీని వెనుక లోతైన రాజకీయ ప్రయోజనాలు ఉన్నట్లు తెలుస్తోంది. రానున్న ఉప ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పటిష్టమైన 'లౌకిక కూటమి'ని నిర్మించడమే లక్ష్యంగా ఈ సమావేశం జరిగినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. 2026 ఏప్రిల్ అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే అతిపెద్ద పార్టీగా ఆవిర్భవించినప్పటికీ, మ్యాజిక్ ఫిగర్‌కు స్వల్ప దూరంలో నిలిచింది. ఇతర పక్షాల అండతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన విజయ్, ప్రస్తుతం తన అధికారాన్ని సుస్థిరం చేసుకునే పనిలో



నిమగ్నమయ్యారు. మరోవైపు అన్నాడీఎంకే నుంచి వలసల పరంపర కొనసాగుతోంది. తాజాగా కరూర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి ఎం.ఆర్. విజయభాస్కర్ తన పదవికి రాజీనామా చేసి టీవీకేకు మద్దతు ఇచ్చేందుకు సిద్ధపడటం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. కొత్త ప్రభుత్వం కొలువుదీరినప్పటి నుంచి అన్నాడీఎంకేను వీడిన ఆరో ఎమ్మెల్యే ఈయనే కావడం విశేషం. తాజా పరిణామంతో అసెంబ్లీలో ఆ పార్టీ బలం మరింత క్షీణించింది. రాష్ట్రంలోని ప్రస్తుత రాజకీయ పరిణామాలపై డీఎంకే అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. టీవీకే ప్రభుత్వం అస్థిరతతో కొట్టుమిట్టాడుతోందని, ఇతర పార్టీల నుంచి ఎమ్మెల్యేలను ప్రలోభపెట్టి అధికారాన్ని నిలబెట్టుకుంటోందని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో అతి త్వరలోనే ముందస్తు ఎన్నికలు వస్తాయని జోస్యం చెప్పారు. అయితే, వ్యూహాత్మక పొత్తులు, ఉపఎన్నికల్లో విజయాల ద్వారా పూర్తిస్థాయి మెజారిటీని సాధించి, తమిళనాడు రాజకీయాలపై తనదైన ముద్ర వేయాలని విజయ్ పట్టుదలతో ముందుకు సాగుతున్నారు.



# 'అయోధ్య'లో మన జోక్యం అవసరం లేదు

**ఒవైసీ విమర్శలు.. షియా గురువు కౌంటర్**

**విచారణ సక్రమంగా జరుగుతోందని వెల్లడి**

**దర్యాప్తులో జోక్యం చేసుకోవద్దని హితవు**

అయోధ్య: అయోధ్య రామ మందిరం విరాళాల సేకరణలో చోటుచేసుకున్న అక్రమాలపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణ పారదర్శకంగా కొనసాగుతోందని ప్రముఖ షియా మత గురువు స్పష్టం చేశారు. ఈ విషయంలో ఇతరులెవరూ జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని ఆయన అభిప్రాయపడ్డారు. విరాళాల వ్యవహారానికి సంబంధించి మజ్లిస్ పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఆయన ఈ విధంగా స్పందించారు. బిజ్నోర్‌లో జరిగిన ఒక సభలో ఒవైసీ మాట్లాడుతూ, ఒకవేళ ఈ కేసులో ముస్లింలు నిందితులుగా ఉండి ఉంటే, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం విచారణకు బదులుగా బుల్డోజర్లు, ఎన్‌కౌంటర్లతో విరుచుకుపడేదని వ్యంగ్యంగా విమర్శించారు. ప్రభుత్వం ఈ విషయంలో పక్షపాత ధోరణితో వ్యవహరిస్తోందని ఆయన ఆరోపించారు. శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టుకు భక్తులు సమర్పించిన విరాళాల వినియోగంలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలతో ఈ వివాదం వెలుగులోకి వచ్చింది. ప్రాథమిక దర్యాప్తు అనంతరం ఆలయ సిబ్బందితో సంబంధమున్న ఎనిమిది మందిపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. సోదాల్లో భాగంగా సుమారు రూ.79.85 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. నిధుల దుర్వినియోగం రూ.7 కోట్ల నుండి రూ.7.5 కోట్ల వరకు ఉండవచ్చని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలో లవకుశ మిశ్రా, అనుకల్ప్ మిశ్రా, అవినాశ్ శుక్లా సహా ఎనిమిది మంది నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. ఈ వివాదం నేపథ్యంలో నైతిక బాధ్యత వహిస్తూ ట్రస్ట్ మాజీ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ తన పదవికి రాజీనామా చేశారు. మరోవైపు, ఒవైసీ చేసిన వ్యాఖ్యలను ఉత్తరప్రదేశ్ మంత్రులు, బీజేపీ నేతలు తీవ్రంగా ఖండించారు. సున్నితమైన మతపరమైన అంశాలను రాజకీయం చేస్తున్నారని వారు ఆక్షేపించారు. ఇదిలా ఉండగా, ఈ కేసుపై సీబీఐ లేదా సిట్ దర్యాప్తు కోరుతూ దాఖలైన పిటిషన్‌పై తక్షణ విచారణ చేపట్టేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది.

# ఈ20 ప్రయోగం కాదు: కేంద్రం

**సుప్రీంకోర్టులో అలా చెప్పలేదని అటార్నీ జనరల్ స్పష్టీకరణ**

న్యూఢిల్లీ: పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్‌ను కలిపే కార్యక్రమం ఒక 'కొనసాగుతున్న ప్రయోగం' అని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో చెప్పిందంటూ వచ్చిన మీడియా కథనాలను భారత అటార్నీ జనరల్ (ఏజీ) కార్యాలయం తీవ్రంగా ఖండించింది. ఈ వార్తలు పూర్తిగా అవాస్తవమని, నిరాధారమైనవని స్పష్టం చేసింది. సుప్రీంకోర్టులో జరిగిన వాదనలను తప్పుగా అన్వయించి ప్రచురించారని పేర్కొంది. ఈ మేరకు అటార్నీ జనరల్ ఆర్. వెంకటరమణి కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా కేంద్రం తరఫున అత్యున్నత న్యాయాధికారి అయిన ఏజీ వాదనలు వినిపించారు. అయితే, నిన్న కొన్ని మీడియా సంస్థలు ప్రచురించిన కథనాల్లో 'ప్రభుత్వం చేపట్టిన ఈ20 కార్యక్రమం ఇంకా ప్రయోగ దశలోనే ఉందని, దాని ప్రభావం వచ్చే ఏడాదికి స్పష్టమవుతుందని' ఏజీ చెప్పినట్లు తప్పుగా పేర్కొన్నాయని కార్యాలయం తెలిపింది. "ఈ కథనాలు పూర్తిగా అవాస్తవం. కోర్టులో మేము సమర్పించిన వాదనలకు ఏమాత్రం సంబంధం లేనివి" అని ప్రకటనలో స్పష్టం చేసింది. ఇథనాల్ బ్లెండింగ్ ప్రోగ్రామ్ (ఈబీపీ) లేదా ఈ20 కార్యక్రమాన్ని ప్రభుత్వం 'ప్రయోగం' అని అభివర్ణించినట్లు వస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తవమని స్పష్టం చేసింది. కోర్టులో జరిగిన వాస్తవ వాదనలను ఏజీ కార్యాలయం వివరించింది. ఇథనాల్ కేటాయింపులకు సంబంధించి ఇలాంటి కేసులే దేశంలోని పలు హైకోర్టుల్లో పెండింగ్‌లో ఉన్నాయని ఏజీ వెంకటరమణి సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఒకే కాంట్రాక్టు ఫ్రేమ్‌వర్క్‌కు సంబంధించిన ఈ కేసులన్నింటిలోనూ ఉమ్మడి న్యాయపరమైన ప్రశ్నలు ఇమిడి ఉన్నాయని, అందువల్ల వీటన్నింటినీ సుప్రీంకోర్టుకు బదిలీ చేసేలా ట్రాన్స్‌ఫర్ పిటిషన్లు దాఖలు చేస్తున్నామని ఆయన తెలిపారు. దీనివల్ల వేర్వేరు కోర్టుల్లో సమాంతర విచారణలను, పరస్పర విరుద్ధమైన తీర్పుల అవకాశాన్ని నివారించవచ్చని ఆయన వాదించారు. ఈ చర్య ద్వారా, దేశవ్యాప్తంగా పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ కలపాలన్న జాతీయ కార్యక్రమానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా సరఫరా కొనసాగించవచ్చని ఏజీ వివరించారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న సుప్రీంకోర్టు, ట్రాన్స్‌ఫర్ పిటిషన్లను దాఖలు చేయడానికి అనుమతించింది. కర్ణాటకకు చెందిన వీఐఎన్‌పీ డిస్టిలరీస్ అండ్ షుగర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు ఇథనాల్ కేటాయింపులను పునఃపరిశీలించాలని ఆ రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ బీపీసీఎల్ వేసిన పిటిషన్‌పై విచారణ జరిపింది.

# భారత్ నమ్మకమైన దేశం

వాషింగ్టన్: అమెరికాకు భారత్ అత్యంత విశ్వసనీయ మిత్రదేశమని, కీలక వ్యూహాత్మక భాగస్వామి అని రిపబ్లికన్ సెనేటర్ స్టీవ్ డైన్స్ పేర్కొన్నారు. చైనాతో పోలిస్తే భారత్‌పై తమకు ఎంతటి నమ్మకం ఉందో వివరించేందుకు ఆయన తన వ్యక్తిగత ఫోన్‌ను ఉదాహరణగా చూపారు. తాను భారత్ పర్యటనకు వెళ్లేటప్పుడు వ్యక్తిగత ఫోన్‌ను వెంట తీసుకెళ్తానని, అదే చైనా పర్యటనకు వెళ్తే మాత్రం భద్రతా కారణాల దృష్ట్యా దానిని వాషింగ్టన్‌లోనే వదిలి వెళ్తానని ఆయన వెల్లడించారు. యూఎస్-ఇండియా స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్ ఫోరమ్ సదస్సులో ఆయన మాట్లాడుతూ, "నేను చైనాకు వెళ్లేటప్పుడు నా ఫోన్ బీజింగ్‌కు తీసుకువెళ్లను. అది వాషింగ్టన్ డీసీలోని నా డెస్క్‌పైనే ఉంటుంది. కానీ నేను ఢిల్లీకి గానీ, భారత్‌లోని మరే ఇతర ప్రాంతానికి గానీ వెళ్లేటప్పుడు నా ఫోన్ ఎప్పుడూ నాతోనే ఉంటుంది. భారత్ అత్యంత విశ్వసనీయమైన మిత్రదేశం అనడానికి ఇదే నిదర్శనం" అని స్పష్టం చేశారు. చైనాతో కొనసాగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికా వ్యూహాత్మక ఆలోచనా సరళికి సెనేటర్ వ్యాఖ్యలు అద్దం పడుతున్నాయి.

# భారీ లాభాల్లో సూచీలు

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం లాభాలతో ముగిశాయి. ఎఫ్ఎంసీజీ, బ్యాంకింగ్, ఫైనాన్షియల్, రియల్టీ రంగాల షేర్లలో బలమైన కొనుగోళ్ల మద్దతుతో సూచీలు లాభపడ్డాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి నిఫ్టీ 140.10 పాయింట్లు (0.59%) పెరిగి 24,005.85 వద్ద స్థిరపడింది. అదేవిధంగా సెన్సెక్స్ 443.97 పాయింట్లు (0.58%) లాభపడి 76,922.64 వద్ద ముగిసింది. నిఫ్టీ టెక్నికల్ అవుట్‌లుక్‌పై విశ్లేషకులు స్పందిస్తూ.. 24,100--24,200 స్థాయిలు తక్షణ నిరోధక జోన్‌గా ఉన్నాయని తెలిపారు. ఈ స్థాయిని అధిగమిస్తే బుల్ జోరు మరింత పెరిగి 24,400 స్థాయికి చేరే అవకాశం ఉందని పేర్కొన్నారు. అదే సమయంలో కింది స్థాయిలో 23,900--23,800 జోన్ కీలక మద్దతు ప్రాంతంగా పనిచేస్తుందని వివరించారు. నిఫ్టీ షేర్లలో ఎటర్నల్, అదానీ ఎంటర్‌ప్రైజెస్, నెస్లే ఇండియా టాప్ గెయినర్లుగా నిలిచి సూచీల పెరుగుదలకు దోహదపడ్డాయి. బ్రాడర్ మార్కెట్ కూడా సానుకూలంగా ముగిసింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.34%, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.36% మేర లాభపడ్డాయి. రంగాలవారీగా చూస్తే.. నిఫ్టీ రియల్టీ ఇండెక్స్ అత్యధికంగా లాభపడగా, ఎఫ్ఎంసీజీ, ఆటో సూచీలు కూడా మంచి పనితీరు కనబరిచాయి. అయితే, ఐటీ, మెటల్, ఫార్మా సూచీలు మాత్రం కాస్త బలహీనంగా ముగిశాయి. 2026 క్యాలెండర్ ఇయర్ రెండో అర్ధభాగంలోకి మార్కెట్లు ఆశాజనకంగా ప్రవేశించాయని విశ్లేషకులు అంటున్నారు. అమెరికా-భారత్ మధ్య వాణిజ్య ఒప్పందంపై అంచనాలు, మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు తగ్గడం, చమురు ధరలు అదుపులో ఉండటం వంటి సానుకూల అంశాలు మార్కెట్ సెంటిమెంట్‌ను బలపరిచాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# కుంభమేళా సమయంలోనే దోపిడీ!

అయోధ్య: అయోధ్య రామమందిరం భక్తులు సమర్పించిన విరాళాల్లో భారీ కుంభకోణం వెలుగు చూసింది. 2025 మహా కుంభమేళా సమయంలో భక్తుల రద్దీ, విరాళాలు ప్రవాహాన్ని ఆసరాగా చేసుకుని భారీగా నిధులు పక్కదారి పట్టించినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఈ కుంభకోణంలో బావ, బావమరిది అయిన అనుకల్ప్ మిశ్రా, లవకుశ్ మిశ్రా కీలక సూత్రధారులుగా ఉన్నారని, నిధులను దారి మళ్లించడంలో వీరే ప్రధాన పాత్ర పోషించారని పోలీసులు ధృవీకరించారు. ఈ కేసుకు సంబంధించి మొత్తం ఎనిమిది మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి సుమారు రూ.79.85 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పర్యవేక్షణలో జరిగే నగదు లెక్కింపు ప్రక్రియలోని లొసుగులని ఆసరాగా చేసుకుని నిందితులు చేతివాటం ప్రదర్శించారు. సీసీటీవీ కెమెరాల కంటపడకుండా దుప్పట్లలో నగదును దాచి తరలించినట్లు విచారణలో వెల్లడైంది. నిందితులపై నేరపూరిత కుట్ర, నమ్మకద్రోహం వంటి పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ప్రధాన నిందితులైన అనుకల్ప్, లవకుశ్ దొంగిలించిన సొమ్ముతో ఫామ్‌హౌస్, రూ.65 లక్షల విలువైన ఇల్లు మరియు పలు ప్లాట్లను కొనుగోలు చేసినట్లు నిర్ధారణ అయింది. అంతేకాకుండా, స్కార్పియో వంటి విలాసవంతమైన కారును కొనుగోలు చేసేందుకు కూడా సిద్ధమయ్యారు. వారి జీవనశైలిలో అకస్మాత్తుగా వచ్చిన మార్పులే పోలీసుల అనుమానాలకు కారణమయ్యాయి. ఈ కుంభకోణం నేపథ్యంలో నైతిక బాధ్యత వహిస్తూ శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్, ట్రస్టీ అనిల్ మిశ్రా తమ పదవులకు రాజీనామా చేశారు. మరోవైపు, నిందితుల తరఫున వాదించబోమని అయోధ్య న్యాయవాదులు సంఘం ప్రకటించింది. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఈ కేసుపై లోతైన విచారణ జరుపుతోంది. భక్తులు ఎంతో నమ్మకంతో సమర్పించిన విరాళాల దుర్వినియోగం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

# వినియోగదారులకు మెరుగైన సేవలే లక్ష్యం

**రూ. 4,528 కోట్ల వ్యాపారంతో దక్షిణ భారతంలో రెండో అతిపెద్ద సహకార బ్యాంకు.. 73వ అఖిల భారత సహకార వారోత్సవాల్లో గాయత్రి బ్యాంక్ సీఈఓ వనమాల శ్రీనివాస్**



జగిత్యాల, జూలై 1 (ఈవార్తలు): వినియోగదారులకు అత్యాధునిక బ్యాంకింగ్ సేవలను అందిస్తూ సహకార బ్యాంకింగ్ రంగంలో గాయత్రి బ్యాంక్ వేగంగా అభివృద్ధి చెందుతోందని బ్యాంక్ సీఈఓ వనమాల శ్రీనివాస్ తెలిపారు. 73వ అఖిల భారత సహకార వారోత్సవాల సందర్భంగా గాయత్రి బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో సహకార పతాకాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రూ.4,528.11 కోట్ల వ్యాపార పరిమాణం, 9.35 లక్షల మంది వినియోగదారులతో దక్షిణ భారతదేశంలో సహకార బ్యాంకింగ్ రంగంలో రెండో అతిపెద్ద బ్యాంకుగా, వినియోగదారుల సంఖ్యలో మొదటి స్థానంలో నిలిచామని తెలిపారు. 2000 సంవత్సరంలో జగిత్యాల కేంద్రంగా ఒకే శాఖతో ప్రారంభమైన గాయత్రి బ్యాంక్ ప్రస్తుతం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో 86 శాఖలతో విస్తరించి 755 మందికి ఉపాధి కల్పిస్తోందని చెప్పారు. బ్యాంకింగ్ రంగంలో డిజిటల్ సాంకేతికతకు ప్రాధాన్యం పెరుగుతున్న నేపథ్యంలో యూపీఐ, ఆధార్ ఆధారిత చెల్లింపు వ్యవస్థ (ఏఈపీఎస్), తక్షణ చెల్లింపు వ్యవస్థ (ఐఎంపీఎస్), ఏటీఎం, జాతీయ స్వయంచాలక చెల్లింపు సేవలు (ఎన్ఏసీహెచ్)తో పాటు ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ), జాతీయ ఎలక్ట్రానిక్ నిధుల బదిలీ (నెఫ్ట్) సేవలను అందుబాటులోకి తీసుకొచ్చామని పేర్కొన్నారు. అలాగే బ్యాంకు సొంత శాఖ గుర్తింపు సంకేత సంఖ్య జీఏబీకే000001ను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. పెద్ద వాణిజ్య బ్యాంకులకు ఏమాత్రం తీసిపోకుండా డిజిటల్ సేవలను అందిస్తూ సహకార బ్యాంకింగ్ రంగంలో ముందంజలో నిలుస్తున్నామని చెప్పారు. వ్యాపార రుణాలు, తనఖా రుణాలు, బంగారు ఆభరణాలపై రుణాలు, గృహ రుణాలు తదితర అన్ని రకాల రుణాలను తక్కువ వడ్డీ రేట్లకే అందిస్తున్నామని వెల్లడించారు. బ్యాంకు అభివృద్ధికి సహకరిస్తున్న భారతీయ రిజర్వు బ్యాంకు, కేంద్ర, రాష్ట్ర సహకార శాఖ అధికారులతో పాటు 9.35 లక్షల మంది వినియోగదారులు, 1.45 లక్షల మంది సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ శ్రీలత, బోగ రవీందర్, పి.టి.ఎస్. శ్రీనివాస్, సి.హెచ్. కృష్ణారెడ్డి, ఎం.వి.జె. శాస్త్రి, సహకార శాఖ అధికారులు, బ్యాంకు పాలకవర్గ సభ్యులు, సిబ్బంది, సభ్యులు పాల్గొన్నారు.



## అభివృద్ధితోనే విమర్శలకు జవాబిస్తా

**జగిత్యాలకు రూ.50 కోట్లతో క్రికెట్ అకాడమీ**

**జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్**

రాయికల్, జూలై 1 (ఈవార్తలు): విమర్శలు చేసే వారితో వాదించడం కంటే అభివృద్ధి పనులతోనే సమాధానం చెబుతానని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. రాయికల్ మండలం కుమ్మరిపెల్లిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి, మైతాపూర్, కుమ్మరిపెల్లిలో ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జగిత్యాల జిల్లాలో రూ.50 కోట్లతో 16 ఎకరాల్లో అత్యాధునిక క్రికెట్ అకాడమీ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రాయికల్ పట్టణంలో రూ.5 కోట్లతో నీటి ట్యాంకు, పైప్‌లైన్ నిర్మాణం చేపట్టి తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. జిల్లాలో రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ కాంప్లెక్స్, రూ.235 కోట్లతో 730 పడకల ఆధునిక ఆసుపత్రి నిర్మాణ పనులు త్వరలో ప్రారంభమవుతాయని వెల్లడించారు. మహిళా డిగ్రీ కళాశాలకు అటానమస్ హోదా రావడం వల్ల విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. చల్గల్‌లో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## ధర్మారం మోడల్ స్కూల్‌లో రేపు స్పాట్ అడ్మిషన్లు

**మిగిలిన సీట్ల భర్తీకి అవకాశం**

పెద్దపల్లి, జూలై 1 (ఈవార్తలు): పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో 2026-27 విద్యా సంవత్సరానికి పాఠశాల విభాగం, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో మిగిలిన సీట్ల భర్తీ కోసం జూలై 3న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఈరవేణి రాజ్‌కుమార్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి పాఠశాల ఆవరణలో ప్రవేశాలు చేపడతామని పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థులు టీసీ, మార్కుల మెమోలు, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, ఇతర సంబంధిత ధ్రువపత్రాలతో హాజరుకావాలని సూచించారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

## నాకు ప్రాణ హాని ఉంది

**కస్టడీకి ఇవ్వొద్దు: సీఐ నాగరాజు**

విజయవాడ, జూలై 1 (ఈవార్తలు): "నా ప్రాణాలకు ముప్పు ఉంది.. కేసు ఒప్పుకోవాలంటూ నాపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నారు" అంటూ గాదె సాయికృష్ణ లాకప్ డెత్ కేసులో సస్పెండ్ అయిన సీఐ నాగరాజు న్యాయమూర్తి ముందే సంచలన విమర్శలు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో తీవ్ర దుమారం రేపిన ఈ కేసు విచారణలో భాగంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోర్టు ముందుకు వచ్చిన ఆయన, తన గోడును వెళ్లబోసుకున్నారు. ఈ కేసులో తనను అకారణంగా ఇరికించేందుకు కుట్ర జరుగుతోందని, బలవంతంగా నిందితుడిగా మార్చే ప్రయత్నాలు చేస్తున్నారని నాగరాజు న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్లారు. ప్రత్యేక దర్యాప్తు బృందం జరిపిన విచారణకు తాను పూర్తిగా సహకరించానని, తన దగ్గరున్న సమాచారమంతా ఇప్పటికే అధికారులకు ఇచ్చేశానని చెప్పారు. ఇప్పుడు తన వద్ద అదనంగా చెప్పడానికి ఎలాంటి సమాచారం లేదని, పైగా పోలీస్ కస్టడీకి ఇస్తే తన ప్రాణాలకే ముప్పు పొంచి ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.



# ప్రజల్లో బీఆర్ఎస్‌పైనే విశ్వాసం

**కాంగ్రెస్ నుంచి కారు పార్టీలోకి ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ సమక్షంలో చేరిక**

మెట్‌పల్లి, జూలై 1 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం వేములకుర్తి గ్రామ ఉపసర్పంచ్ బర్మ మల్లయ్యతో పాటు పలువురు వార్డు సభ్యులు కాంగ్రెస్ పార్టీని వీడి బుధవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. మెట్‌పల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ సమక్షంలో వారు గులాబీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ పార్టీపై ప్రజల్లో ఉన్న విశ్వాసం, పార్టీ నాయకత్వంపై నమ్మకంతోనే పార్టీలో చేరినట్లు కొత్తగా చేరిన నాయకులు తెలిపారు. వేములకుర్తి గ్రామంలో బీఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేసి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. ఎమ్మెల్యే సంజయ్ మాట్లాడుతూ పార్టీలో చేరిన నాయకులకు స్వాగతం పలికి, పార్టీ బలోపేతానికి కలిసి పనిచేయాలని సూచించారు.





## జగిత్యాలలో నెల పాటు పోలీస్ యాక్ట్

**అనుమతి లేని ధర్నాలు, ర్యాలీలు బంద్**

**ఎస్పీ అశోక్ కుమార్ కీలక ఆదేశాలు**

జగిత్యాల, జూలై 1 (ఈవార్తలు): జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా జూలై 1 నుంచి 31వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా పోలీస్ యాక్ట్-1861 అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. పోలీసు అధికారుల ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, రాస్తారోకోలు, నిరసన కార్యక్రమాలు, ర్యాలీలు, బహిరంగ సభలు, సమావేశాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. అలాగే నిబంధనలకు విరుద్ధంగా డీజే సౌండ్ సిస్టమ్‌ల వినియోగాన్ని నిషేధించినట్లు పేర్కొన్నారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే చర్యలు, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించే చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలందరూ పోలీసు శాఖకు సహకరించాలని ఎస్పీ అశోక్ కుమార్ విజ్ఞప్తి చేశారు.





# జర్నలిస్టుల పిల్లలకు ఫీజులో 50% రాయితీ

**కలెక్టర్ సర్క్యులర్‌కు ఐజేయూ జగిత్యాల శాఖ కృతజ్ఞతలు**

జగిత్యాల, జూలై 1 (ఈవార్తలు): టీయూడబ్ల్యూజే--ఐజేయూ కృషితో జిల్లాలో జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు పాఠశాలల్లో స్కూల్ ఫీజులో 50 శాతం రాయితీ లభించిందని సంఘం జిల్లా అధ్యక్షుడు చీటి శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం జగిత్యాలలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ కల్పించాలని జిల్లా కార్యవర్గం తరఫున జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్, ప్రైవేటు విద్యాసంస్థల్లో జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలని సర్క్యులర్ జారీ చేశారని చెప్పారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌కు సంఘం తరఫున కృతజ్ఞతలు తెలిపారు. అర్హులైన ప్రతి జర్నలిస్టు కుటుంబానికి ఈ రాయితీ అందేలా ప్రైవేటు విద్యాసంస్థలతో చర్చిస్తామని, ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైతే జిల్లా కార్యవర్గం దృష్టికి తీసుకురావాలని సూచించారు. జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు సంఘం నిరంతరం కృషి చేస్తోందన్నారు. జర్నలిస్టుల కుటుంబాలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించేందుకు జిల్లా వైద్యశాఖ అధికారులతో చర్చలు జరిపామని, త్వరలో శిబిరం ఏర్పాటు చేస్తామని తెలిపారు. యూనియన్ సభ్యులకు గుర్తింపు కార్డుల జారీ ప్రక్రియ 85 శాతం పూర్తయిందని, మిగిలిన వారు వివరాలు అందించాలని కోరారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బెజ్జంకి సంపూర్ణచారి, ఉపాధ్యక్షులు గడ్డల హరికృష్ణ, హైదర్ అలీ, కోశాధికారి సిరిసిల్ల వేణుగోపాల్, సహాయ కార్యదర్శి గుర్రం చంద్రశేఖర్, కార్యవర్గ సభ్యుడు సంబు రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ప్రజాసంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం**

గంగాధర, జూలై 1 (ఈవార్తలు): ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. గంగాధర మండలం మధురానగర్ లో రూ.30 లక్షలతో ఆధునీకరించిన ఆర్టీసీ బస్టాండ్ ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత బిఆర్ఎస్ పాలనలో ఆర్టీసీని పట్టించుకున్న వారు లేరని గుర్తు చేశారు. గంగాధర బస్టాండ్ అధ్వానంగా ఉండేదని, కనీసం బస్సులు కూడా బస్టాండులోకి వెళ్లలేదని గుర్తు చేశారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత బస్టాండ్ ఆధునికరణ కోసం కృషి చేసినట్లు పేర్కొన్నారు. బస్టాండ్ చుట్టూ సీసీ రోడ్డు, ఆధునిక మరుగుదొడ్లు, ప్రయాణికులు కూర్చోవడానికి అనవుగా కుర్చీలు ఏర్పాటు చేయించినట్లు తెలిపారు. సంబంధిత అధికారులతో మాట్లాడి ఆర్టీసీ బస్సులు బస్టాండులోకి వచ్చేలా చర్యలు చేపట్టారు మరియు ఈ విద్యాసంవత్సరం నుండి గంగాధర మండల పరిధిలో చదువుతున్న అనేక మంది విద్యార్థుల సౌకర్యార్థం బస్ పాస్ కౌంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో బస్టాండు అభివృద్ధి కి మరింత కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎం భూపతిరెడ్డి, డిపో మేనేజర్ విజయ మాధురి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మంత్రి మహేందర్, సింగిల్ విండో చైర్మన్ వెలిచాల తిర్మల్ రావు, సర్పంచ్ ల ఫోరం మండల అధ్యక్షులు ముద్దం నగేష్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తోట కరుణాకర్, సర్పంచ్లు వేముల భాస్కర్, రాచమల్ల రవి, లింగాల లింగయ్య, రేండ్ల శ్రీనివాస్, బీర్ల ఆనందం, చిందం ఆంజనేయులు, బారాజు ప్రభాకర్ రెడ్డి, పురమల్ల మనోహర్, మాజీ జెడ్పిటిసి సత్తు కనకయ్య, పడాల రాజన్న, కంకణాల రాజగోపాల్ రెడ్డి, గునుకొండ బాబు, వేముల అంజి, సాగి అజయ్ రావు, మేర్గ కొండయ్య, కర్ర బాపురెడ్డి, బైరిశెట్టి సంపత్, అట్ల శేఖర్ రెడ్డి, ఆరె రాజశేఖర్, గుడి ప్రవీణ్ రెడ్డి, కడారి కనకయ్య, గుండావేణి తిరుపతి, కొలిపాక మల్లేశం, పెంచాల చందు, మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# వీడని జ్ఞానేశ్వరి మిస్సింగ్ మిస్టరీ

**పాప ఆచూకీ తెలిపిన వారికి రూ.లక్ష రివార్డు ప్రకటించిన పోలీసులు**

చిన్నారి ఫొటోతో రాష్ట్రవ్యాప్తంగా వాల్‌పోస్టర్లు, కరపత్రాల పంపిణీ

కాకినాడ, జూలై 1 (ఈవార్తలు): ఏపీలోని కాకినాడ జిల్లా తుని మండలం సీహెచ్ అగ్రహారానికి చెందిన రెండేళ్ల చిన్నారి జ్ఞానేశ్వరి అదృశ్యం కేసులో మిస్టరీ 25 రోజులుగా కొనసాగుతూనే ఉంది. పాప ఆచూకీ కోసం పోలీసులు తాజాగా కీలక నిర్ణయం తీసుకున్నారు. చిన్నారి సమాచారం అందించిన వారికి రూ.లక్ష నగదు పారితోషికం ఇస్తామని ప్రకటించారు. ఈ మేరకు చిన్నారి ఫొటో, గుర్తింపు వివరాలతో కూడిన వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. కాకినాడ జిల్లాతో పాటు రాష్ట్రంలోని అన్ని ప్రధాన ప్రాంతాల్లో ఈ పోస్టర్లను అంటిస్తున్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచుతామని పోలీసులు హామీ ఇచ్చారు. పాప గురించి తెలిస్తే 9440796508, 9440796531, 9440796573 నంబర్లకు సమాచారం ఇవ్వాలని తుని పోలీసులు ప్రజలను కోరారు.

చిన్నారి అదృశ్యమైనప్పటి నుంచి ఇప్పటివరకు 12 ప్రత్యేక పోలీస్ బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. అటవీ ప్రాంతంతో పాటు సమీపంలోని వాగులు, వంకలను జల్లెడపట్టాయి. అయినా చిన్నారి ఆనవాళ్లు లభించలేదు. మరోవైపు, జీడిపిక్కలు ఏరేందుకు సమీప గ్రామాలు, ఏజెన్సీ ప్రాంతాల నుంచి వచ్చేవారికి పాప వివరాలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేస్తున్నారు. పాపను ఎవరైనా కిడ్నాప్ చేశారా? అనే కోణంలోనూ దర్యాప్తు చేసినా ఎలాంటి ఆధారాలు లభించలేదు. అడవి జంతువులు ఏమైనా దాడి చేశాయా? అనే అనుమానంతో బొమ్మను, మాంసాన్ని సంఘటనా స్థలంలో ఉంచి చూసినా ఫలితం లేకుండా పోయింది. జూన్ 6వ తేదీ మధ్యాహ్నం 11.50 గంటల సమయంలో ఇంటి వద్ద ఆడుకుంటున్న జ్ఞానేశ్వరి కనిపించకుండా పోయింది. పాపతో పాటు వెళ్లిన వారి పెంపుడు శునకం కూడా అదృశ్యమైంది. కొన్ని రోజులకు ఆ శునకం తిరిగి ఇంటికి చేరినప్పటికీ, దాని ద్వారా పాప ఆచూకీ లభించలేదు. ఆ తర్వాత కొన్ని రోజులకే ఆ శునకం కూడా మృతి చెందింది. పాప కనిపించకుండా పోయిన రోజు, ఆ శునకం ఊరిలోని ప్రధాన రహదారిపై ఆందోళనగా తిరుగుతున్న దృశ్యాలు సమీపంలోని ఆలయ సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. కానీ, అది ఎటువైపు వెళ్లిందనే దానిపై స్పష్టత రాలేదు. దాదాపు నెల రోజులు కావస్తున్నా పాప ఆచూకీ లభించకపోవడంతో, ఇప్పుడు ప్రజల నుంచి అందే సమాచారంపైనే పోలీసులు ఆశలు పెట్టుకున్నారు.

# మావిగన్ వర్సెస్ అమరావతి

**వచ్చే ఎన్నికల్లో చూసుకుందాం**

**వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి**

తాడేపల్లి, జూలై 1 (ఈవార్తలు): ఏపీ రాజధాని అమరావతిని వైసీపీ అధినేత జగన్ మరోసారి తిరస్కరిస్తూ సంచలన వ్యాఖ్యలు చేశారు. తాము మావిగన్ కే కట్టుబడి ఉన్నామని... వచ్చే ఎన్నికలు మావిగన్ వర్సెస్ అమరావతి అని ఆయన అన్నారు. మావిగన్ ప్రతిపాదనకు తాము కట్టుబడి ఉన్నామని తెలిపారు. మావిగన్ కు మద్దతు ఇచ్చేవారంతా వైసీపీకి ఓటు వేస్తారని చెప్పారు. ఈ రెండు రాజధానుల్లో ప్రజల మద్దతు దేనికి ఎక్కువగా ఉందో వచ్చే ఎన్నికల్లో తేలిపోతుందని అన్నారు. తాడేపల్లిలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'జగన్ అమరావతికి వ్యతిరేకం' అంటూ కొందరు కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. తాను అమరావతికి వ్యతిరేకం కాదని చెప్పారు. అమరావతి పేరుతో చంద్రబాబు సాగిస్తున్న స్కామ్‌లను, అవినీతిని మాత్రమే తాను ప్రశ్నిస్తున్నానని చెప్పారు. అవినీతి లేని రాజధాని కావాలనేదే తన ఆకాంక్ష అని, అందుకే ఈ మావిగన్ ప్రతిపాదనను తీసుకొచ్చామని పేర్కొన్నారు. ఈ సరికొత్త ప్రతిపాదనకు మద్దతు ఇచ్చేవారంతా వైసీపీకే ఓటు వేస్తారని, వచ్చే ఎన్నికల మేనిఫెస్టోలో కూడా మావిగన్ ను చేరుస్తామని స్పష్టం చేశారు.

వయ్యారి చిత్రం



పాలక్ తివారీ

# పాపరాజీలపై నేహా ధూపియా ఫైర్



బాలీవుడ్ నటి నేహా ధూపియా పాపరాజీల తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. మహిళా సెలబ్రిటీలను కావాలని బ్యాక్ షాట్స్(వెనుక నుంచి ఫోటోలు) తీస్తున్న కొందరు ఫోటోగ్రాఫర్లను ఆమె బహిరంగంగానే ప్రశ్నిస్తూ, వెంటనే అలాంటి ఫోటోలు తీయడం నిలిపివేయాలని హెచ్చరించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవడంతో, సెలబ్రిటీల వ్యక్తిగత గౌరవం, ప్రైవసీ హక్కులపై మరోసారి దేశవ్యాప్తంగా చర్చ మొదలైంది. ఈవెంట్‌లో ఫోటోలు దిగుతున్న సమయంలో నేహా ధూపియా ఒక్కసారిగా ఆగి, ఇలా బ్యాక్ షాట్లు ఎవరు తీస్తున్నారు? వెంటనే ఆపండి. ఇది చాలా అసభ్యకరమైన ప్రవర్తన అంటూ పాపరాజీలను నిలదీశారు. అంతేకాకుండా, తనకు మాత్రమే కాదని, ఎవరికీ ఇలా చేయకండి అంటూ ఎన్నిసార్లు చెప్పినా ఇదే పద్ధతి కొనసాగుతోందని, సెలబ్రిటీలంతా ఫోటోగ్రాఫర్లతో ఎంతో గౌరవంగా మాట్లాడుతున్నామని, అదే గౌరవాన్ని మీరు కూడా చూపించాలంటూ నేహా స్పష్టంగా చెప్పారు. నేహా కామెంట్స్ కేవలం తన వ్యక్తిగత అభిప్రాయాన్ని మాత్రమే వ్యక్తం చేయలేదు. మహిళా సెలబ్రిటీలను కొన్ని స్పెషల్ యాంగిల్స్ లో ఫోటోలు, వీడియోలు తీసి సోషల్ మీడియాలో ఎక్కువ వ్యూస్, వైరల్ కంటెంట్ కోసం ప్రయత్నించే ధోరణిని ఆమె ప్రశ్నించారు. చాలామంది నెటిజన్లు కూడా ఆమెకు మద్దతు తెలుపుతూ, సెలబ్రిటీ అయినంత మాత్రాన వారి పర్సనల్ లిమిట్స్ ను దాటే హక్కు ఎవరికీ లేదంటూ అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ఇటీవలి కాలంలో పాపరాజీల ప్రవర్తనపై సోనాక్షి సిన్హా కూడా తన అత్తింటి కుటుంబ సభ్యులను కారులో ఉండగానే ఫోటోలు తీసిన మీడియా ప్రతినిధులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే ఈ ఏడాది మే నెలలో ఆసుపత్రి సందర్శన సందర్భంగా సల్మాన్ ఖాన్ కూడా ఫోటోగ్రాఫర్ల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేయగా, అనంతరం మీడియా క్షమాపణలు చెప్పిన ఘటన జరిగింది. ఆ తర్వాత సల్మాన్ ఖాన్ సోషల్ మీడియాలో స్పందిస్తూ, తాను ఎప్పుడూ మీడియాకు గౌరవం ఇచ్చానని, కానీ ఎవరి బాధనైనా కంటెంట్‌గా మార్చే ప్రయత్నాలు బాధ కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ కామెంట్స్ కూడా సెలబ్రిటీల ప్రైవసీపై జరుగుతున్న చర్చకు మరింత బలాన్ని చేకూర్చాయి. సోషల్ మీడియా యుగంలో సెలబ్రిటీల ప్రతి కదలిక వార్తగా మారుతున్నప్పటికీ, వారికి కూడా వ్యక్తిగత గౌరవం, భద్రత, ప్రైవసీ హక్కులుంటాయని ఈ సంఘటన మరోసారి గుర్తు చేసింది. వార్తలను సేకరించే క్రమంలో మీడియా స్వేచ్ఛ ఎంత ముఖ్యమో, అదే స్థాయిలో వ్యక్తిగత హద్దులను గౌరవించడం కూడా అంతే అవసరమనే సందేశాన్ని నేహా ధూపియా ఆగ్రహం స్పష్టంగా తెలియజేసింది. సెలబ్రిటీలను వార్తల కోసం వెంబడించడం ఒక వృత్తి అయినప్పటికీ, అది మర్యాద, బాధ్యత, నైతిక విలువల పరిధిలోనే ఉండాలనే డిస్కషన్ ఇప్పుడు నెట్టింట మరింత బలంగా వినిపిస్తోంది.

# శ్వాసిక తీరు సరికాదు: విజయ్ ఆంటోనీ



సినిమా ఎంత బాగున్నా దానికి సరైన పబ్లిసిటీ లేకపోతే బాక్సాఫీస్ వద్ద విజయం సాధించడం ఎంత కష్టమో ప్రస్తుత ట్రెండ్‌లో మనం చూస్తూనే ఉన్నాం. తాజాగా ప్రయోగాత్మక చిత్రాల నటుడు విజయ్ ఆంటోని నటించిన -నూరు సామి- విషయంలో ఇదే జరిగింది. ఈ సినిమా థియేటర్లలో విడుదలై మంచి టాక్ తెచ్చుకున్నా ఆడియన్స్‌ను రప్పించడంలో తీవ్రంగా తడబడుతోంది. సినిమాకు జరిగిన పరిమిత ప్రమోషన్స్ .. అలాగే కథనంలో ఉన్న స్లో పేస్ దీని థియేట్రికల్ రన్‌ను బాగా దెబ్బతీశాయి. దీనివల్ల ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద కమర్షియల్ ఫెయిల్యూర్ దిశగా సాగుతుండటం ఇండస్ట్రీ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో ఈ సినిమాలో హీరోయిన్‌గా నటించిన శ్వాసిక ప్రమోషన్స్‌కు దూరంగా ఉండటంపై విజయ్ ఆంటోని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన ఒక ఈవెంట్‌లో అతడు మాట్లాడుతూ నటి శ్వాసికపై సూటి విమర్శలు చేశారు. తమ సినిమా థియేటర్లలో రన్ అవుతున్న సమయంలో ప్రమోషన్లలో పాల్గొనకుండా మోహన్ లాల్‌తో కలిసి డాన్సులు చేస్తూ బిజీగా గడపడంపై ఆవేదన వ్యక్తం చేశారు. పెద్ద హీరో సినిమా అనగానే ఎంతో ఉత్సాహంగా ఉన్న నటి.. తన సినిమా ప్రమోషన్స్ విషయానికి వచ్చేసరికి ఎందుకు రావడం లేదంటూ అతడు చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి.

# మా ఇంట్లో పాములు కామన్

చాలా కాలం తర్వాత నభా నటేష్ తెలుగులో నాగబంధం అనే సినిమాలో నటించి ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈవారం ప్రేక్షకుల ముందుకు రాబోతున్న నాగబంధం సినిమా ప్రమోషన్‌లో భాగంగా నభానటేష్ పలు ఆసక్తికర విషయాలను మీడియాతో షేర్ చేసుకుంది. నాగబంధం సినిమాలో ఎక్కువగా పాములను చూడబోతున్నామని టైటిల్‌ను చూస్తేనే అర్థం అవుతుంది. షూటింగ్ సమయంలో కొన్ని సార్లు రియల్ పాములు వాడినట్లు ఆ మధ్య యూనిట్ సభ్యులు చెప్పుకొచ్చారు. నిజమైన పాములు వాడిన సమయంలో సెట్స్ లో ఉండే నటీనటుల పరిస్థితి ఏంటో అర్థం చేసుకోవచ్చు. అయితే నభా నటేష్ మాత్రం పెద్దగా భయపడేది కాదట. ఎందుకంటే ఆమెకు చిన్నప్పటి నుంచి పాములు చూసి ఉండటం వల్ల వాటిని చూస్తే భయం వేయదట. తన పూర్వీకుల కాలంకు చెందిన ఇంటిలో పాములు అనేవి సర్వసాధారణంగా నభా నటేష్ చెప్పుకొచ్చింది. 'చిన్నప్పుడు తాను ఉన్న ఇంట్లో పాములు రెగ్యులర్‌గా కనిపించేవి. కర్ణాటకలోని చిక్కమగళూరు ప్రాంతానికి చెందిన వారికి పాములు అంటే భయం ఉండదు, తాను ఆ ప్రాంతానికి చెందిన దాన్ని' అంటూ నభా పేర్కొంది.





# షూటింగ్ చేస్తూ ఎంబీబీఎస్ పరీక్షలు రాశా: శ్రీలీల

నటి శ్రీలీల తన సినీ కెరీర్‌తో పాటు వైద్య విద్యను ఎలా కొనసాగించిందో వెల్లడించింది. 'డాక్టర్స్ డే' సందర్భంగా మాట్లాడుతూ 'వైరల్ వయ్యారి' పాట చిత్రీకరణ జరుగుతున్న సమయంలో కూడా ఎంబీబీఎస్ పరీక్షలకు ప్రాధాన్యం ఇచ్చానని తెలిపింది. "డాక్టర్ కావడం నా చిన్ననాటి కల. అదే నా అతిపెద్ద అభిరుచి. 'వైరల్ వయ్యారి' షూటింగ్ జరుగుతున్న సమయంలో కూడా నా ఎంబీబీఎస్ పరీక్షలకే మొదటి ప్రాధాన్యం ఇచ్చాను. షూటింగ్ పూర్తయ్యాక వెంటనే ప్రాక్టికల్స్‌కు వెళ్లేదాన్ని. మధ్యలో విరామం దొరికితే మళ్లీ సెట్స్‌కు వచ్చి షూటింగ్‌లో పాల్గొనేదాన్ని. ఇది అంత సులభం కాదు. కానీ వైద్య విద్య నాకు ఎంతో విలువైనది" అని శ్రీలీల చెప్పింది. 'వైరల్ వయ్యారి' పాట 'జూనియర్' సినిమాలోనిది. ఈ చిత్రంలో కీరీటి రెడ్డి హీరోగా నటించగా, దేవీ శ్రీ ప్రసాద్ మ్యూజిక్ అందించారు. రాధా కృష్ణ రెడ్డి దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని సాయి కొర్రపాటి నిర్మించారు. శ్రీలీల పలు భాషల్లో వరుస చిత్రాలతో బిజీగా ఉంది. తెలుగు చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్', తమిళ చిత్రం 'పరాశక్తి', అలాగే అనురాగ్ బసు దర్శకత్వంలో కార్తీక్‌తో కలిసి ఓ హిందీ రొమాంటిక్ మ్యూజికల్ చిత్రంలో నటిస్తోంది.

# కయాదు.. ఎక్కడా తగ్గడం లేదు!



సౌత్ ఫిల్మ్ ఇండస్ట్రీలో ప్రస్తుతం ఒక యంగ్ బ్యూటీ పేరు మార్మోగిపోతోంది. తక్కువ కాలంలోనే క్రేజీ ప్రాజెక్టులను దక్కించుకుంటూ స్కైలోకి దూసుకెళుతున్న ఈ నటి ఎవరో కాదు.. యంగ్ బ్యూటీ కయాదు లోహర్. ఇప్పటికిప్పుడు ఈ భామ చేతిలో దాదాపు అరడజను సినిమాలు ఉన్నాయి. మాలీవుడ్ స్టార్ టొవినో థామస్ సరసన -పల్లి చట్టంబి-, విశ్వక్ సేన్ -ఫంకీ- వంటి చిత్రాల్లో నటించిన ఈ బ్యూటీ, కోలీవుడ్‌లో జీవీ ప్రకాష్ సరసన ఓ భారీ చిత్రం -ఇమ్మోర్టల్-లో నటిస్తోంది. అలాగే అధర్వ మురళి, ఫహాద్ ఫాజిల్‌ల కాంబినేషన్‌లో వస్తున్న -ఇదయం మురళి- చిత్రం ఈ నెలలోనే గ్రాండ్‌గా రిలీజ్ కాబోతోంది. వీటన్నింటితో పాటు నేచురల్ స్టార్ నాని సరసన -ది ప్యారడైజ్- చిత్రంలో సుబ్బు పాత్రలో నటిస్తూ టాలీవుడ్‌లోనూ హాట్ టాపిక్‌గా మారింది. ఇలాంటి క్రేజీ లైనప్‌లో ఉన్న ఈ ముద్దుగుమ్మకు కెరీర్‌లోనే బిగ్గెస్ట్ జాక్‌పాట్ ఆఫర్ లభించింది. స్టార్ హీరో సూర్య సరసన ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ -హోంబలే ఫిలిమ్స్- నిర్మిస్తున్న పాన్-ఇండియా సినిమాలో కయాదు లోహర్ కథానాయికగా ఎంపికైంది. ఈ భారీ ఆఫర్ల నేపథ్యంలో కయాదు లోహర్ ఒక్కో సినిమాకి ఎంత పారితోషికం తీసుకుంటోంది? ఇప్పుడు పెద్ద బ్యానర్ల సినిమాల కోసం రెమ్యునరేషన్ పెంచిందా? అనే చర్చ ఇండస్ట్రీ వర్గాల్లో జోరుగా సాగుతోంది. పరిశ్రమ సమాచారం ప్రకారం.. ఈ యంగ్ బ్యూటీ ఇప్పటివరకు మీడియం బడ్జెట్-రీజినల్ (మలయాళం, కన్నడ) సినిమాలకు రూ.40 లక్షల నుండి రూ.60 లక్షల వరకు పారితోషికం అందుకుంది. కెరీర్ ప్రారంభంలో ఉన్న హీరోయిన్లకు ఇది ప్రామాణిక పారితోషికం. అయితే నాని సరసన -ది ప్యారడైజ్-, సూర్య సరసన హోంబలే ఫిలిమ్స్ వంటి పాన్-ఇండియా రేంజ్ ప్రాజెక్టులు చేతికి రావడంతో కయాదు డిమాండ్ మార్కెట్లో ఒక్కసారిగా పెరిగింది. ఈ క్రేజ్.. స్టార్ హీరోల సరసన అవకాశాల నేపథ్యంలో కయాదు తన పారితోషికాన్ని భారీగా పెంచేసిందని గుసగుస వినిపిస్తోంది. ప్రస్తుతం పెద్ద బ్యానర్లు , మల్టీ-లాంగ్వేజ్ సినిమాల కోసం ఏకంగా రూ.80 లక్షల నుండి రూ.1.2 కోట్ల వరకు డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం.

# లెనిన్.. అఖిల్ గెలుస్తాడా?




అక్కినేని అఖిల్ హీరోగా తెరకెక్కిన లెనిన్ సినిమా ట్రైలర్ విడుదలైన తర్వాత సోషల్ మీడియాలో భారీ చర్చ మొదలైంది. చాలా కాలంగా సరైన విజయాన్ని ఎదురుచూస్తున్న అఖిల్ కు సినిమా కీలకంగా మారడంతో ట్రైలర్ పై అందరి దృష్టి పడింది. అయితే ట్రైలర్ కు వస్తున్న రెస్పాన్స్ లో ఆసక్తికరమైన అంశం ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. అదే.. సినిమా కథను ట్రైలర్ లోనే ఎక్కువగా చూపించారా? అనే చర్చ. మురళీ కిషోర్ అబ్బూరు దర్శకత్వంలో రూపొందిన ఆ సినిమా రాయలసీమ పొలిటికల్ బ్యాక్ డ్రాప్ లో సాగే యాక్షన్ డ్రామాగా కనిపిస్తోంది. ట్రైలర్ లో అఖిల్ ను గతంలో కనిపించని రా అండ్ రస్టిక్ లుక్ లో చూపించారు. స్థానిక యాస, మాస్ యాక్షన్, ఎమోషనల్ సీన్స్, తమన్ అందించిన బ్యాక్ గ్రౌండ్ స్కోర్ ట్రైలర్ కు బలం చేకూర్చాయి.





# 40 ఏళ్లకు..

# నాకౌట్‌లో మెక్సికో విన్

## ఈక్వెడార్‌పై 2-0తో ఘన విజయం

నాలుగు దశాబ్దాల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ, ఫిఫా ప్రపంచకప్ నాకౌట్ దశలో మెక్సికో చారిత్రక విజయాన్ని నమోదు చేసింది. ఉత్కంఠభరిత మ్యాచ్‌లో ఈక్వెడార్‌ను 2-0 తేడాతో ఓడించి రౌండ్ ఆఫ్ 16లో అడుగుపెట్టింది. మెక్సికో సిటీలోని ప్రఖ్యాత అజ్టెకా స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో ఆతిథ్య జట్టు అద్భుతమైన ప్రదర్శనతో అభిమానులను ఉర్రూతలూగించింది.

**1986 తర్వాత ప్రపంచకప్ నాకౌట్ మ్యాచ్‌లో మెక్సికోకు ఇదే తొలి విజయం కావడం విశేషం. మ్యాచ్ ప్రారంభానికి ముందు ఉరుములతో కూడిన వర్షం కారణంగా గంట ఆలస్యమైనప్పటికీ, స్టేడియంలోని 80,000 మందికి పైగా అభిమానుల ఉత్సాహం ఏమాత్రం తగ్గలేదు.**



ఆరంభం నుంచే మెక్సికో దూకుడుగా ఆడింది. ఆట 22వ నిమిషంలో రాబర్టో అల్వారాడో అందించిన పాస్‌ను సద్వినియోగం చేసుకున్న జూలియన్ క్విన్యోన్స్, అద్భుతమైన గోల్‌తో మెక్సికోకు ఆధిక్యాన్ని అందించాడు. ఈ టోర్నమెంట్‌లో అతనికి ఇది మూడో గోల్. మరో 9 నిమిషాల తర్వాత, 31వ నిమిషంలో స్టార్ ప్లేయర్ రౌల్ జిమెనెజ్ మరో గోల్ చేసి మెక్సికో ఆధిక్యాన్ని 2-0కు పెంచాడు. అంతర్జాతీయ కెరీర్‌లో ఇది అతనికి 47వ గోల్. తొలి అర్ధభాగంలోనే రెండు గోల్స్‌తో పటిష్ట స్థితిలో నిలిచిన మెక్సికో, రెండో అర్ధభాగంలో డిఫెన్స్‌పై దృష్టి సారించింది. ఈక్వెడార్ ఆటగాళ్లు గోల్ చేయడానికి చేసిన ప్రయత్నాలను సమర్థంగా అడ్డుకుంది. మరోవైపు మెక్సికో కెప్టెన్ సీజర్ మోంటెస్ కూడా గోల్ చేసే అవకాశాలను తృటిలో చేజార్చుకున్నాడు. ఆట చివరిలో అదనపు సమయంలో రిఫరీతో వాగ్వాదానికి దిగిన ఈక్వెడార్ డిఫెండర్ పియరో హిన్‌కాపీకి రెడ్ కార్డ్ చూపడంతో ఆ జట్టు 10 మంది ఆటగాళ్లతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఈ విజయంతో 1994 నుంచి వరుసగా ఏడు నాకౌట్ మ్యాచ్‌లలో ఓడిపోయిన పరంపరకు మెక్సికో ముగింపు పలికింది. 1986లో బల్గేరియాపై ఇదే అజ్టెకా స్టేడియంలో నాకౌట్ విజయం సాధించిన తర్వాత, మళ్లీ ఇన్నాళ్లకు మెక్సికో అదే ఘనతను పునరావృతం చేసింది. ఈ టోర్నీలో ఇప్పటివరకు ఆడిన నాలుగు మ్యాచ్‌లలో ఒక్క గోల్ కూడా ఇవ్వకుండా రికార్డు సృష్టించింది. 1990లో ఇటలీ తర్వాత ఈ ఘనత సాధించిన ఆతిథ్య జట్టుగా నిలిచింది. ఆదివారం అజ్టెకా స్టేడియంలో జరిగే రౌండ్ ఆఫ్ 16 మ్యాచ్‌లో ఇంగ్లాండ్ లేదా డీఆర్ కాంగోతో మెక్సికో తలపడనుంది. ఈ చారిత్రక విజయంతో జట్టులో, అభిమానుల్లో ఆత్మవిశ్వాసం రెట్టింపు అయింది.




# టీ20ల్లో

# రారాజు ఇషాన్

### టెస్టుల్లో బూమ్రా టాప్

ఐసీసీ తాజాగా విడుదల చేసిన ప్లేయర్ ర్యాంకింగ్స్‌లో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. భారత యువ వికెట్ కీపర్-బ్యాటర్ ఇషాన్ కిషన్, తన సహచర ఆటగాడు అభిషేక్ శర్మను వెనక్కి నెట్టి టీ20 ఫార్మాట్‌లో ప్రపంచ నంబర్ 1 బ్యాటర్‌గా అవతరించాడు. దాదాపు ఏడాది పాటు అగ్రస్థానంలో కొనసాగిన అభిషేక్ శర్మ ఆధిపత్యానికి ఇషాన్ తెరదించాడు. మరోవైపు టెస్ట్ ఫార్మాట్‌లో ఆస్ట్రేలియా విధ్వంసకర బ్యాటర్ ట్రావిస్ హెడ్ తన కెరీర్‌లో తొలిసారి నంబర్ 1 ర్యాంకును కైవసం చేసుకున్నాడు. నేడు ఐసీసీ ప్రకటించిన ఈ ర్యాంకింగ్స్‌లో ఇషాన్ కిషన్ తన కెరీర్‌లోనే అత్యుత్తమ రేటింగ్ పాయింట్లను సాధించాడు. ఇటీవల ముగిసిన టీ20 ప్రపంచకప్‌లో అతను కనబరిచిన అద్భుతమైన ఫామ్ ఈ ఘనతకు కారణమైంది. ఆ టోర్నీలో ఇషాన్ దాదాపు 200 స్ట్రైక్ రేట్‌తో 317 పరుగులు సాధించాడు. ముఖ్యంగా పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' ప్రదర్శనతో జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. ప్రస్తుతం ఇషాన్‌కు, రెండో స్థానానికి పడిపోయిన అభిషేక్ శర్మకు మధ్య కేవలం ఏడు రేటింగ్ పాయింట్ల తేడా మాత్రమే ఉంది. ఈ ఘనతతో విరాట్ కోహ్లీ, సూర్యకుమార్ యాదవ్, అభిషేక్ శర్మల తర్వాత టీ20ల్లో నంబర్ 1 ర్యాంకు సాధించిన నాలుగో భారత ఆటగాడిగా ఇషాన్ కిషన్ రికార్డు సృష్టించాడు. టీ20 ర్యాంకింగ్స్‌లో ఇతర ఆటగాళ్లు కూడా తమ స్థానాలను మెరుగుపర్చుకున్నారు. ఐర్లాండ్ కెప్టెన్ లోర్కాన్ టక్కర్ నాలుగు స్థానాలు ఎగబాకి 77వ ర్యాంకుకు, రాస్ అడైర్ ఆరు స్థానాలు మెరుగుపరుచుకుని 84వ ర్యాంకుకు చేరుకున్నారు. బౌలింగ్ విభాగంలో ఐర్లాండ్ సీమర్ మాథ్యూ హంఫ్రీస్ ఒక స్థానం మెరుగై 25వ ర్యాంకు సాధించాడు. ఆల్‌రౌండర్ల జాబితాలో భారత ఆటగాడు శివమ్ దూబే మూడు స్థానాలు ఎగబాకి ఏడో స్థానంలో నిలిచాడు. టీ20 ఫార్మాట్‌లోనే కాకుండా టెస్ట్ ర్యాంకింగ్స్‌లోనూ భారీ మార్పులు జరిగాయి. న్యూజిలాండ్‌తో జరిగిన నాటింగ్‌హామ్ టెస్టులో ఇంగ్లండ్ ఆటగాళ్లు హ్యారీ బ్రూక్, జో రూట్ విఫలం కావడంతో ఆస్ట్రేలియా బ్యాటర్ ట్రావిస్ హెడ్ నంబర్ 1 స్థానానికి చేరాడు. దీంతో బ్రూక్ రెండో స్థానానికి, రూట్ రెండు స్థానాలు దిగజారి మూడో స్థానానికి పడిపోయారు. ఇదే సమయంలో భారత పేస్ గుర్రం జస్ప్రీత్ బూమ్రా, న్యూజిలాండ్ బౌలర్ మాట్ హెన్రీని వెనక్కి నెట్టి టెస్ట్ బౌలింగ్‌లో తిరిగి ఏకైక నంబర్ 1గా తన స్థానాన్ని పదిలం చేసుకున్నాడు. ఇంగ్లండ్‌పై న్యూజిలాండ్ విజయం ఆ జట్టు ఆటగాళ్ల ర్యాంకులపై సానుకూల ప్రభావం చూపింది. బ్యాటింగ్ విభాగంలో రచిన్ రవీంద్ర ఏడో స్థానానికి, డారిల్ మిచెల్ 11వ స్థానానికి, డెవాన్ కాన్వే 15వ స్థానానికి చేరుకున్నారు. మరోవైపు అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ బెన్ స్టోక్స్, తన కెరీర్‌ను టెస్ట్ ఆల్‌రౌండర్ల జాబితాలో మూడో స్థానంతో ముగించడం విశేషం. శ్రీలంకపై అద్భుత ప్రదర్శన కనబరిచిన వెస్టిండీస్ పేసర్లు షమర్ జోసెఫ్ (14వ ర్యాంకు), కెమర్ రోచ్ (17వ ర్యాంకు) కూడా తమ ర్యాంకులను మెరుగుపరుచుకున్నారు.



# శ్రీశాంత్‌పై నిషేధం ఎత్తివేత

టీమిండియా మాజీ ఫాస్ట్ బౌలర్, కేరళకు చెందిన ప్రముఖ క్రికెటర్ ఎస్. శ్రీశాంత్‌కు భారీ ఊరట లభించింది. అతనిపై విధించిన మూడేళ్ల నిషేధాన్ని కేరళ క్రికెట్ అసోసియేషన్ (కేసీఏ) రద్దు చేసింది. కేసీఏపై గతంలో తాను చేసిన వ్యాఖ్యలకు శ్రీశాంత్ బేషరతుగా క్షమాపణ చెప్పడంతో అసోసియేషన్ ఈ నిర్ణయం తీసుకుంది. దీంతో శ్రీశాంత్, కేసీఏ మధ్య కొంతకాలంగా నడుస్తున్న వివాదానికి తెరపడినట్లయింది. ఇవాళ జరిగిన కేరళ క్రికెట్ అసోసియేషన్ ప్రత్యేక సర్వసభ్య సమావేశంలో (స్పెషల్ జనరల్ బాడీ మీటింగ్) ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. సోషల్ మీడియా, ఇతర మాధ్యమాల ద్వారా కేసీఏ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా వ్యాఖ్యలు చేశారంటూ గతేడాది కేరళ క్రికెట్ లీగ్ (కేసీఎల్) సీజన్‌కు ముందు శ్రీశాంత్‌పై కేసీఏ మూడేళ్ల నిషేధం విధించింది.



ఈ చర్య వల్ల కేసీఏ ఆధ్వర్యంలో జరిగే ఎలాంటి కార్యకలాపాల్లోనూ, ముఖ్యంగా కేరళ క్రికెట్ లీగ్‌లో పాల్గొనే అవకాశం శ్రీశాంత్ కోల్పోయాడు. అసోసియేషన్ నిర్ణయాన్ని సవాలు చేస్తూ శ్రీశాంత్ తిరువనంతపురం కోర్టును ఆశ్రయించాడు. అయితే, అతని పిటిషన్‌ను కోర్టు కొట్టివేయడంతో నిషేధం కొనసాగింది. న్యాయస్థానంలో చుక్కెదురు కావడంతో శ్రీశాంత్ తన వైఖరిని మార్చుకుని, తాను చేసిన వ్యాఖ్యలపై తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ కేసీఏకు అధికారికంగా బేషరతు క్షమాపణ లేఖను సమర్పించాడు. ఈ క్షమాపణ లేఖపై ప్రత్యేక సర్వసభ్య సమావేశంలో సభ్యులు సుదీర్ఘంగా చర్చించారు. శ్రీశాంత్ పశ్చాత్తాపాన్ని పరిగణనలోకి తీసుకున్న సభ్యులందరూ ఏకగ్రీవంగా నిషేధాన్ని ఎత్తివేయడానికి అంగీకరించారు. ఈ నిర్ణయంతో శ్రీశాంత్‌కు ఊరట కల్పించినప్పటికీ, కేసీఏ ఒక గట్టి హెచ్చరిక జారీ చేసింది. భవిష్యత్తులో సంస్థ ప్రతిష్ఠకు నష్టం కలిగించేలా ప్రవర్తించినా లేదా బహిరంగ వ్యాఖ్యలు చేసినా తీవ్రమైన క్రమశిక్షణా చర్యలు తప్పవని స్పష్టం చేసింది. ఈ నిర్ణయంతో కేరళ క్రికెట్ లీగ్ సీజన్-3లో ఏరీస్ కొల్లం సెయిలర్స్ జట్టుకు సహ యజమానిగా శ్రీశాంత్ కొనసాగేందుకు మార్గం సుగమమైంది.

# పాండ్యా కోసం 7 జట్ల పోటీ!

ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్య వచ్చే ఐపీఎల్ సీజన్‌కు ముందు జట్టును వీడే అవకాశాలపై ఊహాగానాలు జోరందుకున్నాయి. అతణ్ని ట్రాన్స్‌ఫర్ విండోలో దక్కించుకోవడానికి ఏకంగా ఏడు ఫ్రాంచైజీలు ఆసక్తి చూపుతున్నాయని 'టైమ్స్ ఆఫ్ ఇండియా' కథనం వెల్లడించింది. ఆ కథనం ప్రకారం.. చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) హార్దిక్‌ను తమ జట్టులోకి తీసుకునే రేసులో ముందంజలో ఉంది. సీఎస్‌కేకు కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) గట్టి పోటీ ఇస్తుండగా, రాజస్థాన్ రాయల్స్ కూడా తీవ్రంగా ప్రయత్నిస్తున్న జట్లలో ఒకటిగా పేర్కొంది. రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ), సన్‌రైజర్స్ హైదరాబాద్ మినహా మిగతా అన్ని ఫ్రాంచైజీలు హార్దిక్‌పై ఆసక్తి కనబరుస్తున్నట్లు నివేదిక తెలిపింది. 2015లో ముంబై ఇండియన్స్‌తో ఐపీఎల్ కెరీర్ ప్రారంభించిన హార్దిక్ 2022లో గుజరాత్ టైటాన్స్ కెప్టెన్‌గా మారాడు. అనంతరం మళ్లీ ముంబై ఇండియన్స్‌కు తిరిగి వచ్చి కెప్టెన్సీ చేపట్టాడు. అయితే అతడి నాయకత్వంలో ముంబై గత మూడు సీజన్లలో పది, మూడు, తొమ్మిదో స్థానాల్లో నిలిచింది. హార్దిక్ పాండ్య తన శిక్షణ కేంద్రాన్ని ముంబై నుంచి బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ)కు శాశ్వతంగా మార్చుకున్నాడు. ప్రస్తుతం గాయం నుంచి కోలుకుంటున్న అతడు బెంగళూరు శివారులో నివాసం అద్దెకు తీసుకుని జాతీయ జట్టు లేదా ఐపీఎల్ లేని సమయంలో అక్కడే శిక్షణ కొనసాగించాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం.



నేటి ఈవార్తలు

సంపాదకీయం Editorial

# డిజిటల్ యుగంలో పౌర హక్కుల పరిరక్షణ

ఒకప్పుడు మన ఇంటి తాళం చెవిని కాపాడుకోవడమే భద్రతకు సంకేతం. నేడు మన వ్యక్తిగత సమాచారం, బ్యాంకు వివరాలు, ఆరోగ్య రికార్డులు, విద్యా ధ్రువపత్రాలు, ఆన్‌లైన్ లావాదేవీలు, సోషల్ మీడియా వివరాలు..ఇవన్నీ మన కొత్త ఆస్తులు. ఈ ఆస్తులను రక్షించుకోవడం ఇప్పుడు ఇంటికి తాళం వేయడం కంటే కూడా ముఖ్యమైంది. ఎందుకంటే డిజిటల్ ప్రపంచంలో ఒకసారి సమాచారం లీకైతే దాన్ని తిరిగి పూర్తిగా నియంత్రించడం దాదాపు అసాధ్యం. భారత్ ప్రపంచంలోనే అత్యంత వేగంగా డిజిటల్ సేవలను విస్తరించిన దేశాల్లో ఒకటి. యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్, డిజిటల్ బ్యాంకింగ్, ఈ-గవర్నెన్స్, ఆన్‌లైన్ విద్య, టెలిమెడిసిన్, ఈ-కామర్స్ వంటి సేవలు కోట్లాది మంది జీవితాలను సులభతరం చేశాయి. గ్రామీణ ప్రాంతాల్లో కూడా డిజిటల్ సేవల వినియోగం గణనీయంగా పెరిగింది. అయితే ఈ పరిణామం మరో కీలక ప్రశ్నను ముందుకు తెచ్చింది-మన వ్యక్తిగత సమాచారం నిజంగా ఎంత సురక్షితంగా ఉంది? 21వ శతాబ్దంలో "డేటా కొత్త చమురు" అనే వ్యాఖ్య తరచుగా వినిపిస్తోంది. వ్యక్తుల అలవాట్లు, కొనుగోళ్లు, ప్రయాణాలు, ఆరోగ్య సమాచారం, ఆర్థిక లావాదేవీలు-ఇవన్నీ విలువైన సమాచారంగా మారాయి. ఈ సమాచారాన్ని విశ్లేషించి కంపెనీలు తమ వ్యాపార వ్యూహాలను రూపొందిస్తున్నాయి. ప్రభుత్వాలు కూడా ప్రజా సేవలను మెరుగుపరచడానికి డేటాను వినియోగిస్తున్నాయి. అయితే డేటా వినియోగం ఎంత ముఖ్యమో, దాని దుర్వినియోగం అంత ప్రమాదకరం. వ్యక్తిగత సమాచారం అనుమతి లేకుండా సేకరించడం, విక్రయించడం, హ్యాకింగ్ ద్వారా దొంగిలించడం, మోసాలకు ఉపయోగించడం వంటి సంఘటనలు ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్నాయి. భారతదేశంలో వ్యక్తిగత గోప్యతను అత్యున్నత న్యాయస్థానం ప్రాథమిక హక్కులో భాగంగా గుర్తించింది. ఈ నేపథ్యంలో డిజిటల్ గోప్యత అనేది కేవలం సాంకేతిక అంశం కాదు; అది రాజ్యాంగం కల్పించిన వ్యక్తిగత స్వేచ్ఛకు సంబంధించిన అంశం. ఒక పౌరుడి సమాచారం ఎవరితో పంచుకోవాలి? ఎంతకాలం భద్రపరచాలి? ఏ ప్రయోజనం కోసం వినియోగించాలి? అనే విషయాల్లో పారదర్శకత ఉండాలి. "డేటా యజమాని" కంపెనీలు కాదు..ఆ సమాచారం అందించిన పౌరుడే అనే భావన బలపడాలి. ఇటీవలి కాలంలో సైబర్ మోసాలు గణనీయంగా పెరిగాయి. నకిలీ కాల్స్, ఫిషింగ్ సందేశాలు, ఓటీపీ మోసాలు, డీప్‌ఫేక్ వీడియోలు, సోషల్ మీడియా ఖాతాల హ్యాకింగ్, పెట్టుబడుల పేరుతో మోసాలు సామాన్యులను తీవ్రంగా నష్టపరుస్తున్నాయి. కృత్రిమ మేధ అభివృద్ధితో డీప్‌ఫేక్ సాంకేతికత మరింత ప్రమాదకరంగా మారుతోంది. నిజం కాని వీడియోలు, స్వరాలను సృష్టించి ప్రజలను మోసం చేసే అవకాశాలు పెరుగుతున్నాయి. భవిష్యత్తులో డేటా భద్రత కేవలం ఐటీ సంస్థల బాధ్యతగా కాకుండా ప్రతి పౌరుడి బాధ్యతగా కూడా మారనుంది. భారత్ డిజిటల్ ఆర్థిక వ్యవస్థ వేగంగా విస్తరిస్తోంది. లక్షల కోట్ల రూపాయల డిజిటల్ చెల్లింపులు ప్రతి నెల జరుగుతున్నాయి. ఈ వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం ఉండాలంటే డేటా భద్రత అత్యున్నత స్థాయిలో ఉండాలి. ఒక పెద్ద డేటా లీక్ లేదా సైబర్ దాడి ప్రజల్లో నమ్మకాన్ని దెబ్బతీసే ప్రమాదం ఉంది. అందుకే బ్యాంకులు, ఫిన్‌టెక్ సంస్థలు, ఈ-కామర్స్ కంపెనీలు, ప్రభుత్వ శాఖలు అత్యాధునిక సైబర్ భద్రతా వ్యవస్థలను నిరంతరం నవీకరించాలి. చట్టాలు మాత్రమే సరిపోవు. ప్రజల్లో కూడా డిజిటల్ అవగాహన పెరగాలి. డేటా రక్షణకు పటిష్ఠమైన చట్టాలు, వేగవంతమైన అమలు, స్వతంత్ర పర్యవేక్షణ వ్యవస్థ, సంస్థల బాధ్యత, ప్రజల్లో అవగాహన.. ఈ ఐదు అంశాలు కలిసి పనిచేసినప్పుడే సమర్థవంతమైన డిజిటల్ భద్రత సాధ్యమవుతుంది. అదే సమయంలో కొత్త సాంకేతికతలను ప్రోత్సహిస్తూనే వ్యక్తిగత గోప్యతను పరిరక్షించే సమతుల్య విధానాలు రూపొందించాలి. ఆవిష్కరణలను అడ్డుకోకుండా పౌర హక్కులను కాపాడటం ప్రభుత్వాల ముందున్న ప్రధాన సవాలు.

*కొన్ని సందర్భాలు కేవలం ఒక కీలక విజయాన్ని మాత్రమే సూచించవు. ఇవి మన ప్రయాణాన్ని సరికొత్తగా మారుస్తాయి. నాలుగు పంచాయతీ రాజ్ కార్యక్రమాలు ఈ యేటి ప్రతిష్ఠాత్మక జాతీయ ఈ-గవర్నెన్స్ అవార్డులకు ఎంపిక కావడం అలాంటి ఒక అద్భుత క్షణమే. ఈ విజయం ఏ ఒక్క కార్యాలయానికో పరిమితమైంది కాదు. డిజిటల్ సాధికారత సాధిస్తున్న గ్రామీణ భారత్‌పై నమ్మకం ఉంచిన ప్రతి గ్రామ పంచాయతీకి, ప్రతి పౌరుడికి దక్కిన గౌరవం ఇది. గౌరవ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి దార్శనికత స్ఫూర్తితో భారతదేశపు పంచాయతీలు.. నమ్మకం, సాంకేతికత, పరివర్తనలతో కూడిన ఒక సరికొత్త అధ్యాయాన్ని లిఖిస్తున్నాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో పన్నెండేళ్ల సుపరిపాలన ప్రస్థానాన్ని మనం వేడుకగా చేసుకుంటున్న ప్రస్తుత తరుణంలో లభించిన ఈ గుర్తింపు ఎంతో సముచితమైనది. నేడు మన పంచాయతీ రాజ్ సంస్థలు ప్రభుత్వ పథకాలను అమలు చేసే సంస్థలుగా మాత్రమే కాకుండా సుపరిపాలనలో మూడో అంచెగా ఎంతో ఆత్మవిశ్వాసంతో, సమర్థవంతంగా, సాంకేతిక పరిజ్ఞానాన్ని వేగంగా అందిపుచ్చుకునే స్థాయికి ఎదిగిన తీరును ఈ పురస్కారం తెలియజేస్తోంది.*



## ఈ-పాలన..

# పంచాయతీల విజయం!



ప్రొఫెసర్ ఎస్‌పీ సింగ్ భగేల్
కేంద్ర పంచాయతీరాజ్ శాఖ సహాయ మంత్రి

పరిపాలనా సంస్కరణలు- ప్రజా ఫిర్యాదుల విభాగం ఏర్పాటు చేసిన 'జాతీయ ఈ-గవర్నెన్స్ పురస్కారాలు'... సాంకేతిక ఆధారిత సేవలందించడంలో దేశంలోనే అత్యున్నత ప్రమాణాలకు ప్రతీకలుగా నిలుస్తాయి. ఈ ఏడాది 7 విభాగాల్లో ఎంపికైన మొత్తం 17 ప్రాజెక్టుల్లో 4 ప్రాజెక్టులు పంచాయతీ రాజ్ రంగానికి చెందినవి కావడం విశేషం. గ్రామీణ స్థాయిలో సరికొత్త ఆవిష్కరణలకు అనువైన వాతావరణాన్ని కల్పించేందుకు గత పన్నెండేళ్లుగా నిరంతరం చేసిన కృషి, పెట్టుబడుల సహజ ఫలితమే ఇది. మ పంచాయతీల పనితీరును అంచనా వేయడానికి పంచాయతీ రాజ్ మంత్రిత్వ శాఖ రూపొందించిన అత్యున్నత సాధనం 'పంచాయతీ అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్'. ఇది డేటా అనలిటిక్స్ ద్వారా డిజిటల్ పరివర్తన సాధించినందుకు ప్రతిష్ఠాత్మక 'గోల్డ్ అవార్డు'ను కైవసం చేసుకుంది. ఈ విధానాన్ని తీసుకురావడానికి ముందు దేశవ్యాప్తంగా ఉన్న 2.5 లక్షలకు పైగా గ్రామ పంచాయతీల పనితీరును అంచనా వేయడానికి ఎలాంటి ప్రామాణికమైన, డేటా ఆధారిత వ్యవస్థ లేదు. కానీ నేడు ఇది డేటా, పనితీరు, గుర్తింపు, సామాజిక భాగస్వామ్యాలను అనుసంధానిస్తూ ఒక పారదర్శకమైన అభిప్రాయ సేకరణ వ్యవస్థను సృష్టించింది. రెండు గ్రామ పంచాయతీలు నేరుగా ఈ ప్రతిష్ఠాత్మక గుర్తింపును సాధించడం అంతే హర్షణీయం. మహారాష్ట్రలోని సాంగ్లీ జిల్లా 'కడేపూర్ గ్రామ పంచాయతీ'.. కృత్రిమ మేధ, బ్లాక్‌చైన్ సాంకేతికతల ద్వారా 1,300లకు పైగా ఆన్‌లైన్ సేవలను అందిస్తూ అద్భుతమైన డిజిటల్ వ్యవస్థను నిర్మించింది. ఈ క్షేత్రస్థాయి కార్యక్రమాలకు గాను ఈ పంచాయతీ 'గోల్డ్ అవార్డు'ను గెలుచుకుంది. సొంత ఆదాయాన్ని దాదాపు 194 శాతం పెంచుకోవడంతో పాటు మహిళల్లో పూర్తిస్థాయి డిజిటల్ అక్షరాస్యత సాధించిన పశ్చిమ త్రిపురలోని బిజోయ్ నగర్ గ్రామ పంచాయతీని 'సిల్వర్ అవార్డు' వరించింది. మారుమూల ప్రాంతాల్లోని గిరిజన ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను మరింత చేరువ చేస్తూ 'ఈ-ఆరోగ్య ధామిని' ప్రాజెక్టు ద్వారా జిల్లా స్థాయి కార్యక్రమాలు చేపట్టినందుకు నందుర్బార్ జిల్లా పరిషత్ ఆరోగ్య విభాగం 'గోల్డ్ అవార్డు'ను కైవసం చేసుకుంది. మొత్తంగా చూస్తే ఈ అవార్డులన్నీ మనకు ఒక ముఖ్యమైన విషయాన్ని తెలియజేస్తున్నాయి. ఈ-గవర్నెన్స్‌లో నైపుణ్యం- ఇకపై కేవలం రాష్ట్ర రాజధానులకో లేదా జిల్లా కేంద్రాలకో పరిమితం కాలేదు. అదిప్పుడు మన గ్రామాలు, గ్రామ సభల్లో కూడా సమానంగా భాగమైంది. ఈ ఏడాది 30 రాష్ట్రాల నుంచి 1.65 లక్షలకు పైగా గ్రామ పంచాయతీలు ఇందులో పాల్గొనడం.. మనమందరం కలిసి పెంపొందించిన సంస్థాగత ఆత్మవిశ్వాసానికి నిదర్శనంగా నిలుస్తోంది.

ఈ మార్పు యాదృచ్ఛికంగా వచ్చింది కాదు. గత పన్నెండేళ్లుగా పంచాయతీ రాజ్ మంత్రిత్వ శాఖ మన పంచాయతీలకు నిరంతరం మెరుగైన సాంకేతిక సాధనాలను అందిస్తూ వస్తోంది. ఇందులో భాగంగా 'ఈ-గ్రామ స్వరాజ్' ప్లాట్‌ఫామ్.. దేశవ్యాప్తంగా 2.59 లక్షలకు పైగా పంచాయతీల ప్రణాళికలు, బడ్జెట్, చెల్లింపుల ప్రక్రియను డిజిటలైజ్ చేసింది. దీని ద్వారా పబ్లిక్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ఆధారంగా రూ. 3.16 లక్షల కోట్లకు పైగా ఆన్‌లైన్ లావాదేవీలు విజయవంతంగా జరిగాయి. కృత్రిమ మేధతో 23 భారతీయ భాషల్లో పనిచేసే 'సభాసార్' వ్యవస్థ.. 1.35 లక్షలకు పైగా పంచాయతీల్లో గ్రామ సభ ముగిసిన వెంటనే నిమిషాల్లోనే వాటి తాలూకు నివేదికలను సిద్ధం చేస్తోంది. వీటన్నింటితో పాటు కోటికి పైగా డౌన్‌లోడ్‌లతో దూసుకుపోతున్న 'మేరీ పంచాయితీ యాప్'.. అభివృద్ధికి సంబంధించిన ప్రతీ సమాచారాన్ని నేరుగా ప్రజల చేతుల్లో పెడుతోంది.

ఈ విజయాలతో పాటు 'స్వామిత్వ' పథకం కింద 2026 జూన్ మధ్య నాటికి 3.30 లక్షల గ్రామాలలో డ్రోన్ సర్వేలను పూర్తి చేయటం ద్వారా 1.94 లక్షల గ్రామాల్లో 3.19 కోట్ల ఆస్తి హక్కు పత్రాలు సిద్ధం చేశారు. ఇది గ్రామీణ కుటుంబాల ఆస్తి హక్కులు, వారికి రుణాలు లభించే అవకాశాలను మరింత బలోపేతం చేసింది. 15వ ఆర్థిక సంఘం పరిధిలో గ్రామీణ స్థానిక సంస్థలకు గతంలో ఎన్నడూ లేనంత అత్యధిక శాతంతో రూ. 2.82 లక్షల కోట్ల నిధులు విడుదలయ్యాయి. ఇప్పుడు 16వ ఆర్థిక సంఘం.. 2026 నుంచి 2031 కాలానికి దాదాపు 84 శాతం పెరుగుదలతో రూ. 4.35 లక్షల కోట్ల నిధులు ఇవ్వాలని సిఫార్సు చేసింది.

ఈ దార్శనికతను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు పంచాయతీ రాజ్ మంత్రిత్వ శాఖ 'సేవా సే సమృద్ధి: పంచాయతీల సారథ్యంలో సేవలందించటం' పేరుతో వరుసగా ప్రాంతీయ సదస్సులను ప్రారంభించింది. ఆరోగ్యం, విద్య, జీవనోపాధి, మౌలిక సదుపాయాలు వంటి రంగాలలో పౌర కేంద్రిత సేవలను బలోపేతం చేయడానికి ఈ సదస్సులు ఎంతగానో తోడ్పడుతున్నాయి. ఇవి పంచాయతీ ప్రతినిధులను, జిల్లా అధికారులను, ఆయా రంగాల నిపుణులను ఒకే వేదికపైకి తీసుకువస్తున్నాయి. విజయవంతమైన స్థానిక నమూనాలను ప్రదర్శించడం, వివిధ రాష్ట్రాల మధ్య పరస్పర అభ్యాసానికి వీలు కల్పించడం ద్వారా ఈ సదస్సులు ఈ దార్శనికతను నేరుగా గ్రామీణ క్షేత్రస్థాయికి తీసుకెళ్తున్నాయి. ఇలాంటి నమూనాలను దేశవ్యాప్తంగా ఇతర ప్రాంతాల్లోనూ అమలు చేసే అవకాశం ఎంతో ఉంది. నేడు దేశంలోని పంచాయతీలు ఒకదాని నుంచి మరొకటి పరస్పరం స్ఫూర్తి పొందుతూ, జాతీయ ఈ-గవర్నెన్స్ అవార్డులు (ఎన్ఏఈజీ 2026) పొందిన సంస్థల విజయాలను ఆదర్శంగా తీసుకుంటూ.. సొంత ఊర్లలో సేవల ద్వారా సమృద్ధిని సాధించడానికి ఈ వినూత్న నమూనాలను అవలంబించాలని బలంగా కోరుకుంటున్నాయి.

ప్రజల జీవితాలను మరింత సులభతరం చేసే పరిపాలనే నిజమైన సుపరిపాలన అని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారు నిరంతరం చెబుతుంటారు. పారదర్శకమైన, సాంకేతిక ఆధారిత వ్యవస్థల ద్వారా చేకూరే 'జీవన సౌలభ్యం' ఒక ప్రభుత్వ సంకల్పానికి, సామర్థ్యానికి నిజమైన కొలమానం. ఎదుటివారిని గౌరవించడం ద్వారా మనకు కూడా గౌరవం లభిస్తుందనేది ఒక సార్వత్రిక సత్యం. మన పంచాయతీలకు డిజిటల్ సాధనాలను అందించడం ద్వారా, సేవలందించడంలో వాటి సామర్థ్యంపై నమ్మకం ఉంచడం ద్వారా కేంద్ర ప్రభుత్వం గ్రామీణ వ్యవస్థను బలోపేతం చేయడమే కాకుండా మన దేశం ఈ ప్రతిష్ఠాత్మక వేదికపై సగర్వంగా గుర్తింపు పొందేందుకు మార్గం సుగమం చేసింది. 2047 నాటికి 'వికసిత్ భారత్' సాధన దిశగా దేశం అడుగులు వేస్తున్న తరుణంలో సాధికారత సాధించిన పంచాయతీల పాత్ర మరింత కీలకంగా మారుతోంది. గ్రామీణ భారతంలో దాదాపు 90 కోట్ల మంది ప్రజలు నివసిస్తున్న నేపథ్యంలో మన పంచాయతీ రాజ్ సంస్థల బలమే మన అందరి ఉమ్మడి పురోగతి వేగాన్ని నిర్దేశిస్తుంది. 'వికసిత్ పంచాయత్' అనేది 'వికసిత్ భారత్' కంటే వేరైనది కాదు.. అది వికసిత్ భారత్‌కు అసలైన పునాది.

ఈ నాలుగు అవార్డులు సాధించిన విజయాలను మాత్రమే తెలియజేయవు. క్షేత్రస్థాయిలో అహర్నిశలు శ్రమిస్తున్న ప్రతి సర్పంచ్‌కు, పంచాయతీ కార్యదర్శికి, మహిళా ప్రతినిధులకు.. వారి కృషిని దేశం గుర్తిస్తోందని, గౌరవిస్తోందని చెప్పే గొప్ప ప్రోత్సాహం ఇది. గత పన్నెండేళ్లుగా నిరంతరం చేసిన కృషి ఫలితంగానే నేడు ఇలాంటి అద్భుతం వెలుగులోకి రావడానికి అనువైన వాతావరణం ఏర్పడింది. జాతీయ ఈ-గవర్నెన్స్ అవార్డుల (ఎన్ఏఈజీ 2026) గుర్తింపు నుంచి మొదలుకొని దేశవ్యాప్తంగా విజయవంతంగా సాగుతున్న 'సేవా సే సమృద్ధి' సదస్సుల వరకు ఈ విజయం.. 'ఈ-గవర్నెన్స్ ఇప్పుడు గ్రామీణ భారతంలో మూలాల వరకు చొచ్చుకుపోయింది' అనే విషయాన్ని మనకు మళ్లీ ఘనంగా చాటిచెబుతోంది. 'వికసిత్ పంచాయత్' ద్వారా 'వికసిత్ భారత్' నిర్మాణాన్ని సాకారం చేసే ఈ ప్రయాణం.. ప్రతి ఏటా మరింత శక్తిని పుంజుకుంటూ నిరంతరం ముమ్ముందుకు సాగుతుందని ఇది స్పష్టం చేస్తోంది.

**రచయితలకు ఆహ్వానం!**

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.